Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ


నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | బుధవారం మే 28 2025 | సంపుటి:2 | సంచి 239 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-

## ఉగ్రవాద ముల్లునే

# ఏరిపడేస్తాం



**1947లో దేశాన్ని ముక్కలు చేసిన దగ్గరనుంచీ పాక్‌ది ఉగ్రబాటే**

- పీవోకే స్వాధీనంలో పటేల్ మాటలను లక్ష్యపెట్టని పాలకులు
- అదే ఇప్పటికీ మనలను వేధిస్తోంది
- గుజరాత్ పర్యటనలో ఎల్లెడలా దేశభక్తి కనిపించింది
- ఇది భారత్ ప్రజల హృదయాలను ఆవిష్కరించింది
- రెండోరోజు గుజరాత్ పర్యటనలో మోడీ

**తెలంగాణవీణ గాంధీనగర్,**

భారత్ నుంచి ఉగ్రవాద ముల్లును ఏరేస్తామని ప్రధాని మోడీ చెప్పారు. గుజరాత్ పర్యటనలో భాగంగా రెండోరోజు మంగళవారం ప్రధాని మోడీ గాంధీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. తర్వాత మహాత్మా మందిర్‌లో రూ.5,536 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. మరోసారి పాకిస్తాన్‌ను లక్ష్యంగా చేసుకుని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం నుండి ఉగ్రవాద ముల్లును తొలగించాలని -మిగతా 2 లో



## ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల పట్ల వివక్ష

### ఉన్నత పోస్టుల భర్తీలో మోడీ నిర్లక్ష్యం: రాహుల్

**న్యూఢిల్లీ,**

ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాల వారి పట్ల మోడీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని రాహుల్ తీవ్రంగా విమర్శించారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబిసి తరగతుల చెందిన వారి పట్ల మోడీ ప్రభుత్వం చూపుతున్న వివక్షను వ్యవస్థాగత వివక్షగా రాహుల్ అభివర్ణించారు. ఈ తరగతులకు చెందిన అర్హత కలిగిన అభ్యర్థులను ఎన్‌ఎఫ్‌ఎస్ (నాట్ ఫౌండ్ సూటబుల్) అని తిరస్కరిస్తున్నారు.

-మిగతా 2 లో




## కడపలో అట్టహాసంగా టీడీపీ మహానాడు

- జెండా ఆవిష్కరించి ప్రారంభించిన చంద్రబాబు
- తెలుగుదేశం జెండా..జాతికి అండ అన్న అచ్చెన్నాయుడు

**తెలంగాణవీణ కడప,**

అధికారం చేపట్టిన తొలి ఏడాదిలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కడపలో అట్టహాసంగా ప్రారంభమైంది. కడప అంతటా పసుపుమయమయ్యింది. మూడురోజుల పాటు జరిగే మహానాడుకు టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌తో పాటు, మంత్రులు అచ్చెన్నాయుడు, కేశవ్, అనిత తదితర నేతలుమాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. చంద్రబాబు ఫొటో ప్రదర్శన, రక్తదాన శిబిరాల్ని ప్రారంభించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి , పార్టీ జెండాను

-మిగతా 2 లో



## జూన్ 2న కవిత కొత్త పార్టీ

- షర్మిల లాగే పాదయాత్రకు సన్నాహాలు
- కేసీఆర్ డైరెక్షన్‌లోనే కవిత కొత్త పార్టీ
- బీజేపీ ఏంపీ రఘునంద్ రావు సంచలన వ్యాఖ్యలు

**తెలంగాణవీణ మెదక్,**

తెలంగాణలో ఎమ్మెల్సీ కవిత పాదయాత్ర చేస్తారని, అలాగే జూన్ 2న కొత్త పార్టీ ప్రకటన చేస్తారని మెదక్ ఎంపి రఘునందన్ రావు తెలిపారు. జూన్ 2న కవిత కొత్త పార్టీ రాబోతుందని, పార్టీ పెట్టి షర్మిల తరహాలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయనుందని అన్నారు. తుప్రాన్ లో రఘునందన్ రావు పర్యటించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిఆర్ఎస్ లో జరుగుతున్న పరిణామాలపై

-మిగతా 2 లో

## వైఫల్యాలుంటే

# సరిదిద్దుకోండి



**భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయండి**

- వ్యవసాయ ప్రణాళికకు అనుగుణంగా చర్యలు తీసుకోండి
- రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలి
- నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాప్యం తగదు
- కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం



**తెలంగాణవీణ హైదరాబాద్**

"కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు. వైఫల్యాలుంటే సరిదిద్దుకోవాలి. కావాలని ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే వెంటనే వివరణ ఇవ్వండి. చిన్న చిన్న సమస్యలుంటే తక్షణమే పరిష్కరించండి. ఒక్క నిమిషం వృధా చేయొద్దు..

-మిగతా 2 లో



## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

- ఛత్తీస్‌ఘడ్‌లో 18మంది లొంగుబాటు

**తెలంగాణవీణ రాయపూర్,**

దేశ వ్యాప్తంగా మావోల ఏరివేతకు కేంద్రం పూనుకుంది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లోతిష్ట వేసిన మావోయిస్టుల ఏరివేతకు ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఇక ఇటీ-వల కాలంలో మావోలకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. పెద్ద ఎత్తున మావోయిస్టులు హతమయ్యారు. కర్రెగట్టు-లో పదుల కొద్ది మావోలు చనిపోయారు. ఇటీవల అగ్ర నేత నంబాల కేశవరావు కూడా హతమయ్యాడు. ఇలాంటి తరుణంలో ఛత్తీస్‌గఢ్‌లో కీలక

-మిగతా 2 లో



## 21 మంది హైకోర్టు జడ్జిల బదిలీ

- తెలంగాణకు మరో ముగ్గురు
- రాష్ట్ర హైకోర్టుకు జస్టిస్ దేవానంద్
- కొలిజియం సిఫార్సు

**తెలంగాణవీణ న్యూఢిల్లీ**

వివిధ హైకోర్టుల్లో పనిచేస్తున్న 21 మంది న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలిజియం మంగళవారం సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి నేతృత్వంలోని కొలీజియం మంగళవారం సమావేశమై, బదిలీలకు లేదా యథాస్థానాలకు పంపడానికి సిఫార్సు చేసింది. ఈ వివరాలను సుప్రీంకోర్టు అధికారిక -మిగతా 2 లో



## సింగరేణి జాగృతి ఆవిర్భావం

### కోఆర్డినేటర్లను నియమించిన కవిత

**తెలంగాణవీణ హైదరాబాద్,**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో సింగరేణి జాగృతి ఆవిర్భావించింది. మంగళవారం తన నివాసంలో సింగరేణి కార్మికులతో కవిత సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుందన్నారు. టీ-బీజీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ పని

-మిగతా 2 లో

## తెలంగాణలో విస్తరిస్తున్న నైరుతి



- నైరుతికి తోడు బంగాళాఖాతంలో ఆవర్తనం
- పలు జిల్లాల్లో జోరు వానలు
- వేములవాడ జలమయం
- హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

**తెలంగాణవీణ హైదరాబాద్,**

నైరుతి రుతుపవనాలు దక్షిణ తెలంగాణలోకి విస్తరించాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈ కారణంగా రేపు, ఎల్లుండి తెలంగాణలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. గంటకు 40-50 కి.మీ-మిగతా 2 లో

## కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరు?

### వచ్చే నెల 5న హాజరయ్యే ఛాన్స్



**తెలంగాణవీణ హైదరాబాద్,**

కాళేశ్వరం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జూన్ 5వ తేదీన పీసీ ఘోష్ కమిషన్ ముందు కేసీఆర్ విచారణకు హాజరు కావాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. గులాబీ బాస్ కి కాళేశ్వరం మిషన్ నోటీసులు ఇచ్చినప్పటికీ నుంచి పార్టీలో

-మిగతా 2 లో

# వైఫల్యాలుంటే సరిదిద్దుకోండి

(మొదటి పేజీ తరువాయి)

నిర్లక్ష్యం వహించొద్దు. అవసరమైతే లోకల్ గోడౌన్లను లీజుకు తీసుకోండి. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, రుతుపవనాలు, వానాకాలం పంటల సాగు అంశాలపై మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వానలు ముందుగా రావడం వల్ల కొన్ని చోట్ల ధాన్యం సేకరణకు ఇబ్బందులు తలెత్తాయని అన్నారు. చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం భరోసా ఇచ్చారు. ధాన్యం సేకరణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైతే స్థానికంగా గోదాములు అద్దెకు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ""యాసంగిలో గతేడాది 42 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొంటే, ఈసారి 64.50 లక్షల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 90శాతం ధాన్యం సేకరణ పూర్తయింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 48 గంటల్లో రైతులకు ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నాం. ఈ సీజన్‌లో ఇప్పటికే రూ.12,184 కోట్లు చెల్లించాం" అని సీఎం వివరించారు. అధికారులు, జిల్లాల్లో కలెక్టర్లు సమర్థవంతంగా పని చేయటం వల్లనే ప్రభుత్వం ఈ విజయం సాధించిందని వారిని అభినందించారు. దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో ఈ ఏడాది 2.75 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి సాధించటం, రైతులు సాధించిన విజయమని సీఎం అన్నారు. 21 జిల్లాల్లో ధాన్యం సేకరణ విజయవంతంగా సాగగా, 12 జిల్లాల్లో అక్కడక్కడ ఆందోళనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళితే ఈ సమస్యలన్నీ అక్కడికక్కడే పరిష్కారమవుతాయని సీఎం అన్నారు. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు పెద్దగా ప్రచారంలోకి వస్తున్నాయనీ, కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత ఆందోళనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేసిన ఘటనను ఉదాహరించారు. అందుకే కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను దాచిపెట్టకుండా వెల్లడించాలని ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వంపై విష ప్రచారం చేసే వారిపై కేసులు పెట్టేందుకు వెనుకాడ వద్దని సూచించారు.వ్యవసాయ ప్రణాళికకు అనుగుణంగా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాటిని బ్లాక్ మార్కెట్ చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేసే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయడంతో పాటు నేర చరిత్ర ఉన్న వారిపై పీడీ యాక్ట్ పెట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఎంపిక చేసిన మండలాల్లో విజయవంతంగా అమలవుతున్న ఈ చట్టాన్ని త్వరలోనే రాష్ట్రమంతటా అమలు చేస్తామని చెప్పారు. జూన్ మూడు నుంచి 20 వరకు రాష్ట్రమంతటా నిర్వహించే మూడో దశ రెవెన్యూ సదస్సులకు ఇన్‌చార్జి మంత్రులు షెడ్యూల్ రూపొందించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వద్దని సీఎం కలెక్టర్లకు సూచించారు. ఈ నెలాఖరులోగా లబ్దిదారుల తుది జాబితాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

# ఉగ్రవాద ముల్లునే ఏరిపడేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. నేను గత రెండు రోజులుగా గుజరాత్‌లో ఉన్నాను. నిన్న వడోదర, దాహోద్, భుజ్, అహ్మదాబాద్.. ఈరోజు గాంధీనగర్‌ను సందర్శించాను. నేను ఎక్కడికి వెళ్ళినా.. అది కాషాయ సముద్రం గర్జించే శబ్దంలాగా, దేశభక్తి తరంగంలా అనిపించింది. కాషాయ సముద్రం గర్జన, రెపరెపలాడే త్రివర్ణ పతాకం, ప్రతి హృదయంలో మాతృభూమి పట్ల అపారమైన ప్రేమను చూపించింది. ఇది చూడటానికి మరపురాని దృశ్యం అని ఆయన అన్నారు. 1947 లో దేశం మూడు భాగాలుగా విభజించబడింది. ఆ రాత్రినే, కాశ్మీర్‌లో మొదటి ఉగ్రవాద దాడి జరిగింది. మన దేశంలో కొంత భాగాన్ని ముజాహిదీన్ పేరుతో ఉగ్రవాదులను ఉపయోగించి పాకిస్తాన్ స్వాధీనం చేసుకుంది. ఆ రోజున, మనకు పీఓకె వచ్చే వరకు మన సాయుధ దళాలు ఆగకూడదని సర్దార్ పటేల్ చెప్పినా.. ఎవరూ ఆయన మాట వినలేదు. ఇప్పుడు మనం గత 75 సంవత్సరాలుగా ఈ ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నాం. పహల్గామ్ కూడా దానికి ఒక ఉదాహరణ. పాకిస్తాన్‌తో యుద్ధాలు జరిగినప్పుడు, మేము పాకిస్తాన్‌ను మూడుసార్లు ఓడించాం అని మోడీ చెప్పారు. ఒక శరీరం ఎంత బలంగా ఉన్నా, ఒక ముల్లు గుచ్చుకుంటే అంతా నొప్పిగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. పాకిస్థాన్ మద్దతుతో దేశంలోకి ప్రవేశిస్తున్న ఉగ్రవాదమే ఆ ముల్లు అని, దాన్ని తొలగించాల్సిన సమయం వచ్చిందని ఆయన గుర్తు చేశారు. దేశ భద్రత, అభివృద్ధి, సంస్కృతి, జాతీయ గౌరవం గురించి మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని ప్రతి మూలలో దేశభక్తిని చూశానని, ఇది కేవలం గుజరాత్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. ప్రతి భారతీయుడి హృదయంలో ఉందని మోదీ పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో రెండో రోజు వడోదర, దాహోద్, భుజ్, అహ్మదాబాద్ వంటి ప్రాంతాలను సందర్శించిన తర్వాత మోదీ గాంధీనగర్‌లో పలు కార్యక్రమాలను ప్రారంభించారు. 1947 విభజన తర్వాత మొదలైన ఉగ్రవాద దాడులను గుర్తు చేసిన ఆయన, ఆ రోజు ముజాహిదీన్‌ను అంతమొందించి, సర్దార్ పటేల్ సలహాను పాటించి ఉండి ఉంటే, ఈ 75 ఏళ్ల ఉగ్రవాద చక్రం మనకు కనిపించేది కాదన్నారు. పాకిస్థాన్ ఇప్పటికీ ఉగ్రవాదాన్ని ఒక పరోక్ష యుద్ధంగా వినియోగించుకుంటోందని, కానీ అది నిజానికి ఒక వ్యూహాత్మకమైన యుద్ధమేనన్నారు ప్రధాని మోదీ. ఇటీవలి కాలంలో జరిగిన భారత ఉగ్రవాద వ్యతిరేక చర్యల గురించి కూడా ప్రధాని వివరించారు. 22 నిమిషాల్లో భారత్ 9 పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఇది కెమెరాల ముందే జరిగింది. ఇక రుజువుల కోసం ఎవరిని అడగాల్సిన అవసరం లేదు. శవపేటికలపై పాక్ జెండాలు పెట్టి, వారికి సెల్యూట్ చేయడం ద్వారా, వారు ఉగ్రవాదాన్ని తమ అధికారిక విధానంగా చెప్పుకున్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా ప్రధాని మోదీ, దేశ భద్రతపై మౌనంగా ఉండకుండా, ధైర్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. 2014 మే 26న నేను ప్రధాని పదవిని స్వీకరించాను. అప్పటి భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 11వ స్థానం. కానీ ప్రస్తుతం అది నాలుగో స్థానానికి చేరిందని మోదీ గుర్తు చేశారు.

# కడపలో అట్టహాసంగా టీడీపీ మహానాడు

(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం జెండా.. తెలుగు జాతికి అండ అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మహానాడు వేదికపై మంత్రి మాట్లాడుతూ.. తెలుగు ప్రజల కోసం, తెలుగు రాష్ట్రాల ప్రగతి కోసం టీడీపీ కృషి చేస్తుందన్నారు. పౌరుషాల గడ్డ కడపలో పసుపు జెండా సత్తా చూపించేందుకు తెలుగు దండు కదం తొక్కిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ చారిత్రాత్మక మహానాడు ఈసారి కడపలో ఘనంగా జరుగుతోందన్నారు. తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు నేత నారా లోకేష్ అని వెల్లడించారు. పార్టీ కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. వైసీపీ భూస్థాపితం అయిపోయిన పార్టీ అంటూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీకి రాజకీయ భవిష్యత్తు లేదన్నారు. మద్యం, ఇసుక, మైనింగ్ కుంభకోణాలతో జగన్ అండ్ కో టీ-మ్ ప్రజా సంపద దోచుకుందని ఆరోపించారు. వస్తున్నా మీ కోసం అని నాడు చంద్రబాబు భరోసా ఇచ్చారని.. యువగళం పేరుతో తెలుగు ప్రజలకు నారా లోకేష్ అండగా నిలిచారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.
అలుపెరగని శ్రామికుడు సీఎం చంద్రబాబు అని ఏపీ టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ అన్నారు. ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా నిలబడి పోరాడారని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉంటే ఉన్నతస్థాయికి వెళ్లొచ్చని చెప్పారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. యువగళం ద్వారా పార్టీకి లోకేష్ కొత్త శక్తి ఇచ్చారన్నారు. చంద్రబాబు, లోకేష్‌ను చూసి క్రమశిక్షణ నేర్చుకోవాలని పల్లా శ్రీనివాస్ వెల్లడించారు. వైసీపీ పాలనలో పార్టీ అధ్యక్షుడి నుంచి కార్యకర్త వరకు అనేక ఇబ్బందులకు గురయ్యారని వివరించారు. వైసీపీ మాదిరిగా గాలికి పుట్టిన పార్టీ కాదని, తమది బడుగు, బలహీనవర్గాల నుంచి పుట్టిన పార్టీ టీడీపీ అని అన్నారు. ఈ పార్టీని ప్రజల నుంచి దూరం చేయాలన్నా ఎవరికీ సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్న టీడీపీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని, ప్రభుత్వం ఏర్పాటుతో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని కనబరుస్తున్నారని తెలిపారు. ఉన్నా.. లేకున్నా.. ప్రజల కోసమే టీడీపీ రాజకీయం చేస్తున్నదన్నారు.

## 21 మంది హైకోర్టు జడ్జిల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. మద్రాస్ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ బట్టు దేవానంద్‌ను రాష్ట్ర హైకోర్టుకు, తెలంగాణ హైకోర్టు జడ్జి సుజోరు పాల్‌ను కొల్‌కతా హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. కర్ణాటకలో పనిచేస్తున్న జస్టిస్ సి.సుమలత, జస్టిస్ లలిత కన్నెగంటి, పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలిజియం సిఫార్సు చేసింది. కర్ణాటక హైకోర్టు జడ్జిగా ఉన్న జస్టిస్ వి.కామేశ్వరరావు, బాంబే హైకోర్టు జడ్జి నితిన్ వాసుదేవ్ సాంబ్రేలను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. గౌహతి హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ సుమన్ శ్యామ్, ఎల్‌ఎస్ జమీర్, ఎం రంజన్ పాఠక్‌లను వరుసగా బాంబే, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా హైకోర్టులకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ అశ్వనీ కుమార్ మిశ్రాను పంజాబ్-హర్యానా హైకోర్టుకు, పంజాబ్-హర్యానా హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ సంజీవ్ ప్రకాష్ శర్మను రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. జస్టిస్ వివేక్ చౌదరి (అలహాబాద్ హైకోర్టు)ను ఢిల్లీ హైకోర్టుకు, జస్టిస్ దినేష్ కుమార్ సింగ్ (కేరళ)ను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలని కోరింది. జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ (మద్రాస్ హైకోర్టు)ను మధ్యప్రదేశ్‌కు, జస్టిస్ ఓం ప్రకాష్ శుక్లా (అలహాబాద్)ను ఢిల్లీకి బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. జస్టిస్ చంద్రశేఖర్ (రాజస్థాన్ హైకోర్టు)ను బాంబేకు, జస్టిస్ సుధీర్ సింగ్ (పంజాబ్-హర్యానా)ను పాట్నాకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. పంజాబ్-హర్యానా హైకోర్టులో పని చేస్తున్న జస్టిస్ అనిల్ క్షేత్రపాల్‌ను, జస్టిస్ అరుణ్ కుమార్ మోంగా (రాజస్థాన్)ను ఢిల్లీ హైకోర్టుకు, అలహాబాద్ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ జయంత్ బెనర్జీని కర్ణాటకకు బదిలీ చేయాలని కొలిజియం సిఫార్సు చేసింది.

## తెలంగాణలో విస్తరిస్తున్న నైరుతి

(మొదటి పేజీ తరువాయి)

వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం తెలంగాణలోని 4 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 14 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధ, గురువారాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో రాబోవు రెండు, మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 7 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం కూడా ఉన్నందున పాత భవనాలు, చెట్ల కింద ఉండకూడదని హెచ్చరిస్తున్నారు. పొలాలకు వెళ్లే రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. ఇక, హైదరాబాద్ నగరంలో సాయంత్రం 7.30 గంటలకి వాన ప్రారంభమైంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మెహిదీపట్నం, టోలిచౌకి, ఫిలింనగర్, మణికొండ, గచ్చిబౌలి, మియాపూర్, లింగంపల్లి, పటాన్ చెరు, ఆర్సీపురం, బీరంగూడ, సికింద్రాబాద్, మలక్ పేట్, దిల్ సుఖ్ నగర్, ఆరాంఘర్, పంజాగుట్ట, చిలకలగూడ, కుత్బుల్లాపూర్, షాపూర్, సూరారం, దుండిగల్, కొండాపూర్, పాటీనతో పాటు- పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుంది.

## జూన్ 2న కవిత కొత్త పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

జోస్యం చెప్పారు. మాజీ సిఎం కెసిఆరే కవితతో పార్టీ పెట్టిస్తున్నారని అన్నారు. తండ్రి, కుమార్తె మధ్య మధ్యవర్తులెందుకని ప్రశ్నించారు. కవిత గెలిచినప్పుడు కెసిఆర్ దేవుడయ్యారని, ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారని విమర్శించారు. దెయ్యాల మధ్య పదేళ్ల రాజకీయం ఎందుకని రఘునందన్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనమైంది. ఈ లేఖపై ఇప్పటికే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నేతలు తమదైన శైలిలో వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. అలాంటి వేళ మెదక్ ఎంపీ , బీజేపీ నేత రఘునందన్ రావు మరోసారి స్పందించారు. ఆయన విలేకర్లతో
మాట్లాడుతూ.. తండ్రి, కుమార్తెల మధ్య మధ్యవర్తులెందుకని ఆయన సూటిగా ప్రశ్నించారు. జూన్ 2వ తేదీన కవిత కొత్త పార్టీ రాబోతోందని ఆయన జోస్యం చెప్పారు. అనంతరం తెలంగాణలో కవిత పాదయాత్ర చేస్తారని ప్రకటించారు. కవిత గెలిచినప్పుడు కేసీఆర్ దేవుడయ్యారని.. మరి ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారంటూ ఎంపీ రఘునందన్ సందేహం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ రజతోత్సవ సభ వరంగల్‌లో నిర్వహించారు. ఈ సభకు పార్టీ నేతలతోపాటు- కార్యకర్తలంతా భారీగా తరలి వచ్చారు. అనంతరం ఈ సభలో తన తండ్రి కేసీఆర్ ప్రసంగంతోపాటు- కొన్ని అంశాలతో కూడిన లేఖను ఆయనకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత రాశారు. అయితే ఈ లేఖ ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ లేఖను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు తమదైన శైలిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ తర్వాత కేసీఆర్‌తో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ వరుసగా సమావేశమవుతున్నారు. మరోవైపు.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ రిజర్వాయర్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ కేసీఆర్‌తోపాటు- హరీష్ రావు, ఈటల రాజందర్‌లకు నోటీసులు జారీ అయ్యాయి. జూన్ 5వ తేదీన కమిషన్ ఎదుట హాజరు కావాలంటూ బీఆర్ఎస్ చీఫ్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ టాపిక్ డైవర్షన్ కోసమే ఈ లెటర్ పాలిటిక్స్ అనే ఓ చర్చ సైతం రాష్ట్రంలో కొనసాగుతోంది.

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

పరిణామం చోటుచేసుకుంది. సుక్మా జిల్లాలో పోలీసుల ఎదుట 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 10 మందిపై గతంలో రూ.38 లక్షల రివార్డు ఉంది. సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ముందు మావోయిస్టులు లొంగిపోయారు. గత సోమవారం నారాయణపూర్‌లో 26 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ముగ్గురు తలలపై కలిపి రూ.4.5 లక్షల రివార్డు ఉంది. వీరిలో ఐదుగురు మహిళా మావోయిస్టులు ఉన్నారు. వీరి తలపై ఒక్కొక్కరికి రూ. లక్ష రివార్డు ఉంది. ఒకప్పుడు వివిధ ప్రాంతీయ కమిటీ-ల్లో చురుకుగా పనిచేసిన ఈ మహిళలు.. సంవత్సరాల తరబడి కష్టాలు మరియు మావోయిస్టు భావజాలంపై పెరుగుతున్న భ్రమలు కారణంగా హింసాత్మక జీవితాన్ని విడిచిపెట్టాలనే కోరికను వ్యక్తం చేశారు. అధికారులు వారి నిర్ణయాన్ని స్వాగతించారు.ఐ

## ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల పట్ల వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఇది మనువాదం యొక్క కొత్త రూపం అని రాహుల్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, ఓబిసి తరగతులకు చెందిన అభ్యర్థులను నాయకత్వ పాత్రల నుండి మినహాయించడానికి కేంద్రం ఉద్దేశపూర్వకంగానే వారిని అనర్హులుగా మార్చేస్తుంది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో 60 శాతం రిజర్వ్‌డు ప్రొఫెసర్ పోస్టులు, 30 శాతం అసోసియేట్ ప్రొఫెసర్ పదవులు ఖాళీగా ఉన్నాయి. సమానత్వానికి విద్య ఒక సాధనం అనే బిఆర్ అంబేద్కర్ దృక్పథాన్ని మోడీ ప్రభుత్వం దెబ్బతీస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలకు చెందిన వారిని ఉద్దేశపూర్వకంగానే 'నాట్ ఫౌండ్ సూటబుల్' అని తిరస్కరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. కేంద్రం ఈవిధమైన చర్యలతో రాజ్యాంగంపై దాడి చేస్తోంది. సామాజిక న్యాయ ద్రోహానికి పాల్పడుతోంది. ఐఐటిలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు ఇలా అన్నిచోట్ల వీరిపై కుట్ర జరుగుతోంది. వీరు చేసే పోరాటం విద్య కోసమో, ఉపాధి కోసమో చేసే పోరాటం కాదు. ఇది హక్కులు, గౌరవం, భాగస్వామ్యం కోసం చేసే పోరాటమని' అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. తాను ఢిల్లీ యూనివర్సిటీ- స్టూడెంట్ యూనియన్ (డియుఎస్‌యు) విద్యార్థులతో మాట్లాడానని.. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు అమలు చేస్తున్న రిజర్వేషన్లకు వ్యతిరేక చర్యపై పోరాటం చేస్తామని ఆయన అన్నారు.

## సింగరేణి జాగృతి ఆవిర్భావం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామన్నారు. బహుజనులు, యువతకు ప్రాధాన్యత కల్పిస్తాం అని కవిత స్పష్టం చేశారు. సింగరేణి 11 ఏరియాలకు కో ఆర్డినేటర్లను నియమించినట్లు- పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా, సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతి ఏర్పాటైందన్నారు. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ జాగృతి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతాం. కేసీఆర్ నాయకత్వంలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించి సింగరేణిని రక్షించుకున్నామని.. అలాంటి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం తమ అవినీతితో అంతం చేయాలని చూస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్రమోదీ కోసం పని చేస్తున్నాడని అందుకే కార్మికుల ప్రయోజనాలు దెబ్బతీసే లేబర్ కోడ్ గురించి ఒక్కమాట మాట్లాడటం లేదు. అలియాస్ నేమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి అని కవిత డిమాండ్ చేశారు.

## కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరు?

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ ముందు హాజరు కావాలా లేదా అని అంశంపై తర్జనభర్జన జరిగింది.. కానీ, చివరకు వచ్చే నెల 5న విచారణకు వెళ్లడానికి నిర్ణయం తీసుకున్నారు కేసీఆర్. మరోవైపు, జూన్ 6న ఈ-టె-ల రాజేందర్, చివరగా జూన్ 9వ తేదీన హరీష్ రావు హాజరవ్వాలని నోటీసుల్లో పీసీ ఘోష్ కమిషన్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుపై విచారణకు కమిషన్ వేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పా-టైన కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపుగా తుది దశకు చేరుకుంది. అయితే, ప్రాజెక్టు నిర్మాణం జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మంత్రిగా పని చేసిన హరీష్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన ఈటెల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని నోటీ-సులు అందజేసింది.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811



## ఉభయ తెలుగు రాష్ట్రాలకు కొత్తజడ్జిలు



**తెలంగాణవీణ న్యూఢిల్లీ,**

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సుమలత తెలంగాణ హైకోర్టుకు, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ లలిత కన్నెగంటి తెలంగాణ హైకోర్టుకు, పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అభిషేక్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం పేర్కొంది.

## అసత్య ప్రచారాల్లో ఆరితేరిన పాక్

### కువైట్ పర్యటనలో దులిపేసిన అసద్



**తెలంగాణవీణ న్యూఢిల్లీ,**

పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అందజేసిన చిత్రపటం బహుమతిపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కువైట్‌లో భారతీయ ప్రవాసులతో జరిగిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో మాట్లాడిన ఓవైసీ, పాకిస్తాన్ చేస్తున్న అబద్ధ ప్రచారాన్ని ఉద్దేశిస్తూ, నకల్ కర్నేకే లియే అకల్ చాహియే‘ అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2019లో చైనా సైన్యం నిర్వహించిన డ్రిల్‌కు చెందిన ఫోటోను ఇప్పుడు పాక్ సైన్యం 'ఆపరేషన్ బన్యాన్' విజయంగా చిత్రీకరించి ప్రధానికి బహుమతిగా ఇస్తున్నారంటే ఎంత దిగజారిపోయారో అర్థం అవుతుందని ఆయన మండిపడ్డారు. పాకిస్తాన్ చేస్తున్న అసత్య ప్రచారాలపై ప్రజలు నమ్మకం పెట్టకూడదని, అధికారిక భారత ప్రభుత్వ ప్రకటనలకే మద్దతు ఇవ్వాలంటూ ప్రవాస భారతీయులకు ఓవైసీ సూచించారు. భారత్ అంతర్జాతీయంగా శక్తిమంతమైన దేశంగా ఎదుగుతున్న వేళ, ఇలాంటి అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలన్న ప్రయత్నాలు ఎంత సిగ్గుచేటో అని విమర్శించారు. పాక్ తీరును ఆయన తీవ్రంగా ఎండగట్టారు.

## ఐదో జనరేషన్ యుద్ధ విమానం అమ్కా తయారీకి రక్షణశాఖ ఆమోదం

**తెలంగాణవీణ న్యూఢిల్లీ,**

రక్షణ రంగంలో స్వదేశీ తయారీని ప్రోత్సహించే దిశగా రక్షణ శాఖ కీలక ప్రకటన చేసింది. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ల తయారీకి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. ఇతర సంస్థల భాగస్వామ్యంతో బెంగళూరులోని డీఆర్‌డీవో -ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ దీనిని అమలు చేయనుంది. అమ్కా ను రూపొందించడంలో ఈ ప్రక్రియ కీలక మైలురాయిగా నిలువనుంది.భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఐదో తరం యుద్ధ విమానం అడ్వాన్స్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ నమూనాను తొలిసారి 'ఏరో ఇండియా-2025'లో ప్రపంచానికి చూపించారు. కృత్రిమ మేధ ఆధారిత ఎలక్ట్రానిక్ పైలట్, నెట్ ఆధారిత ఆయుధ వ్యవస్థల లాంటి ప్రత్యేకతలు ఈ విమానం సొంతం. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఇది సమర్థంగా సత్తా చాటుతుంది. 25 టన్నుల బరువుండే ఈ లోహ విహంగాన్ని మానవ సహితంగా, మానవ రహితంగా పనిచేసేలా రూపొందించనున్నారు. ఏడీఏ ఈ యుద్ధ విమానం డిజైన్‌ను రూపొందించింది. హైదరాబాద్‌కు చెందిన వేమ్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ ఫ్యాబ్రికేషన్ పనులు చేసింది.


GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండె విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024


## రాజీవ్ యువ వికాస్ లబ్దిదారులకు శుభవార్త

### జూన్ 2న మంజూరు పత్రాలు అందిస్తాం: సీతక్క



**తెలంగాణవీణ హైదరాబాద్,**

తెలంగాణలోని నిరుద్యోగులకు మంత్రి సీతక్క శుభవార్త తెలిపారు. ఉపాధి అవకాశల కల్పన కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా జూన్ 2న లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నామని వెల్లడించారు. రూ. లక్ష లోపు యునిట్లకు మొదటి దశలో ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సం సందర్భంగా రేవంత్ ప్రభుత్వం ఎంపికైన లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందించనున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే.. మరో వైపు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. మొదటి విడతలో రూ. లక్ష లోపు యునిట్లకు ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిందని, దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులంతా రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. నిరుద్యోగుల పాలిట వరంగా రాజీవ్ యువ వికాసం నిలుస్తోందని, బడుగు బలహీన వర్గాలు, పేద యవత జీవితాల్లో రాజీవ్ యువ వికాసం వెలుగులు నింపనుందని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే నిర్మల్ జిల్లా కలెక్టర్ పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేసింది. నాయక్ పోడులు అంటే నిర్మల్ జిల్లా కలెక్టర్ కు తెలియకపోవడం బాధాకరం అన్నారు. అధికారిగా ఉన్నప్పుడు వాళ్లు అన్ని తెలుసుకోవాలని సూచించారు. ఏ కులం, ఏ రిజర్వేషన్ వస్తదో తెలియకపోవడం వారి తప్పు.. రాజ్యంగాన్ని చదవాలని తెలిపింది. ఏ కులం వారికి ఏయే రిజర్వేషన్లు, ఏం హక్కులు ఉన్నాయే తెలుసుకోని వాటిని అమలు చేయాలని చెప్పుకొచ్చింది. ఇలాంటి సమస్య ఎక్కడెక్కడా ఉందో నా దృష్టికి తీసుకురండీ.. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెరట్ ద్వారా సర్టిఫికెట్ల సమస్య పరిష్కరించేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లకు లెటర్లు పంపిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. అయితే, నాయక్ పోడ్ వారికి ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా చూస్తామని మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యంగా పేదల పక్షాన ఈ ప్రభుత్వం నిలపడుతుంది.. పోడు భూముల సమస్యను ప్రభుత్వంతో మాట్లాడి.. నెరవేరే విధంగా చూస్తాను అని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లలో ప్రత్యేకంగా కొన్ని ఇళ్లు నాయక్ పోడ్లకు అందించేలా మంత్రితో మాట్లాడతాను అని పేర్కొన్నారు. అలాగే, జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి కుల ధ్రువీకరణ పత్రం వచ్చే విధంగా చూస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఇక, ఆదివాసీల త్యాగాలు ఎక్కువ.. ఫలాలు తక్కువ అని మంత్రి సీతక్క తెలిపింది. గిరిజన ప్రాంతాలలో నీరు ఉన్నా.. కానీ, ఆదివాసీలకు ప్రయోజనం లేదు అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఆదివాసీల ఉన్నారు.. ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు లేక నిధులు ఏర్పాటు-చేయలేక పోతున్నారు.. జాతి, కులగణన లేనప్పుడు ప్రత్యేక నిధులు కేటాయించడం సాధ్యం కాదని వెల్లడించింది. ఆందరి కులాల దేవుళ్లను గౌరవిద్దాం.. అంతిమంగా మన జాతికి ఉన్న సాంస్కృతిక కార్యక్రమాలను కాపాడుకుందాం.. జాతి గుర్తింపు ఉండాలంటే వేషధారణ ముఖ్యం అని సూచించింది. ములుగు లాంటి ప్రాంతాలలో కాకతీయుల కాలంలో భాష మారింది అని సీతక్క చెప్పారు.

## చరిత్ర సృష్టించిన నేపాలీ షెర్పా.. ఎవరెస్టు శిఖరాన్ని 31వ సారి ఎక్కిన కామి రిటా



**తెలంగాణవీణ కాఠ్మాండు**

నేపాలీ షెర్పా, ప్రఖ్యాత పర్వతారోహకుడు కామి రిటా చరిత్ర సృష్టించాడు. ఎవరెస్టు శిఖరాన్ని అతను 31వ సారి ఎక్కాడు. అత్యధిక సార్లు ఎవరెస్టును అధిరోహించిన రికార్డును నెలకొల్పాడు. గతంలో తన పేరిట ఉన్న రికార్డును తానే బద్దలు కొట్టాడు. ఇవాళ ఉదయం 4 గంటల సమయంలో కామిరిటా.. ప్రపంచంలోని అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్టును ఎక్కాడు.గత రెండేళ్ల నుంచి ట్రెక్కర్ కామి రిటా ప్రతి సీజన్‌లో రెండు సార్లు మౌంట్ ఎవరెస్టును అధిరోహించాడు. ఈసారి భారతీయ సైన్యానికి చెందిన దళాన్ని కామి రిటా తీసుకెళ్లాడు. సెవన్ సమ్మిట్ ట్రెక్స్, 14 పీక్స్ ఎక్స్‌పెడిషన్‌లో సీనియర్ గైడ్‌గా కామి రిటా చేస్తున్నాడు. నేపాల్‌లోని సోలుకుంబ్ సమీపంలోని థామే గ్రామంలో జన్మించాడు. పర్వతారోహణకు అతను జీవితాన్ని అంకితం చేశాడు. 1970, జనవరి 2వ తేదీన అతను పుట్టాడు. చిన్నతనం నుంచి పర్వతాలు ఎక్కాలన్న తపనతో పెరిగాడు. గత రెండు దశాబ్దాల నుంచి కామి రిటా పర్వతాలను అధిరోహిస్తున్నాడు. తొలిసారి 1992లో కామి రిటా మౌంట్ ఎవరెస్ట్ ఎక్కాడు. ఓ బృందానికి అతను సపోర్ట్ సభ్యుడిగా వెళ్లాడు. అప్పటి నుంచి ధైర్యంగా ఎవరెస్టును ఎక్కే ప్రయత్నం చేశాడు. 1994 నుంచి 2025 వరకు కామి రిటా మౌంట్ ఎవరెస్టును 31 సార్లు ఎక్కినట్లు చాంగ్ దావా తెలిపారు. కే2తో పాటు లోసే పర్వతాలను ఒక్కసారి ఎక్కాడు. మనస్లు మూడు సార్లు, చో యూ 8 సార్లు అధిరోహించినట్లు తెలుస్తో

## గోల్డెన్ డోమ్‌తో అంతరిక్ష అణు యుద్ధం

### ఉత్తర కొరియా



**తెలంగాణవీణ ప్యోంగ్‌యాంగ్**

బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణుల నుంచి రక్షణ కల్పించేందుకు అమెరికా సర్కారు గోల్డెన్ డోమ్‌ను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దీనిపై ప్రకటన చేశారు. గోల్డెన్ డోమ్ రక్షణ కవచం.. అంతరిక్ష అణ్వాయుధ యుద్ధానికి దారి తీసే అవకాశాలు ఉన్నట్లు ఉత్తర కొరియా పేర్కొన్నది. ఉత్తర కొరియాకు చెందిన విదేశాంగ శాఖ ఆ డోమ్ వార్తలపై స్పందిస్తూ మూర?త్వంతో అమెరికా అలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించింది. అంతరిక్షాన్ని సైనిక క్షేత్రంగా మారుస్తున్నట్లు ఉత్తర కొరియా పేర్కొన్నది. ట్రంప్ వేసిన ప్లాన్‌తో ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాల సమీకరణ పెరుగుతుందని నార్త్ కొరియా వెల్లడించింది. అమెరికా, దక్షిణ కొరియా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలను కూడా ఉత్తర కొరియా తప్పుపట్టింది.అమెరికా నిర్మిస్తున్న గోల్డెన్ డోమ్ కవచంతో .. తమ అణ్వాయుధ సామర్థ్యం తగ్గిపోతుందని ఉత్తర కొరియా చెప్పింది. కొరియా యూనివర్సిటీకి చెందిన సీనియర్ విశ్లేషకుడు హంగ్ మిన్ తెలిపారు. మిస్సైల్ రక్షణ వ్యవస్థను ఒకవేళ అమెరికా పూర్తి చేస్తే, అప్పుడు ఆ కవచాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ ఆయుధాలను డెవలప్ చేయాల్సి ఉంటుందని ఉత్తర కొరియా తెలిపింది. తమ వద్ద అణ్వాయుధాలు ఉన్నట్లు 2022లో ఉత్తర కొరియా చట్టాన్ని పాస్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పలు సందర్భాల్లో బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లను పరీక్షించింది.

## క్లాస్‌లు ఎగ్గొట్టినా వీసాలు రద్దు..

### విదేశీ విద్యార్థులకు ట్రంప్ సర్కార్ కీలక హెచ్చరికలు

**తెలంగాణవీణ అమెరికా**

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా అమెరికాలో ఉంటున్న విదేశీ విద్యార్థులు, అక్రమ వలసదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలు కారణాలతో విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తూ.. వారిని దేశం నుంచి బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా భారత్ సహా యూఎస్‌లో ఉంటున్న విదేశీ విద్యార్థులకు ట్రంప్ సర్కార్ కీలక హెచ్చరికలు జారీ చేసింది.చదువుకోవడానికి అని అమెరికాకు వెళ్లి విద్యా సంస్థల అనుమతి లేకుండా క్లాసులు ఎగ్గొట్టినా వీసాలు రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు ఇండియాలోని అమెరికా రాయబార కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'డ్రాపౌట్ అయినా, క్లాస్‌లకు గైర్హాజరైనా, విద్యాసంస్థకు చెప్పకుండా స్టడీ ప్రోగ్రామ్ నుంచి వెళ్లిపోయినా.. మీ విద్యార్థి వీసా రద్దవుతుంది. భవిష్యత్తులో ఎలాంటి అమెరికా వీసాలకైనా మీరు అర్హతను కోల్పోతారు. సమస్యల బారిన పడకుండా ఉండేందుకు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించండి. మీ విద్యార్థి వీసాను కొనసాగించుకోండి' అని యూఎస్ ఎంబసీ ఆ ప్రకటనలో వెల్లడించింది.ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తరువాత ఏదో ఒక వంకతో విదేశీయులను వెనక్కి తిప్పి పంపుతున్నారు అమెరికా అధికారులు. ముందస్తు నోటీసు లేకుండా వీసాలను రద్దు చేస్తూ అంతర్జాతీయ విద్యార్థులపై అమెరికా ప్రభుత్వం తన అణచివేతను తీవ్రతరం చేసింది. పాలస్తీనా అనుకూల నిరసనల నుంచి ట్రాఫిక్ ఉల్లంఘనల వరకూ.. ఇలా ఏదో ఒక కారణంతో విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తూ వారిని దేశం నుంచి బహిష్కరిస్తోంది. అమెరికాలో విద్యనభ్యసిస్తున్న 1,000 మందికిపైగా అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను ప్రభుత్వం ఇప్పటికే రద్దు చేసింది. సోసియేటెడ్ ప్రెస్ కథనం ప్రకారం మార్చి నుంచి హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్ వంటి ప్రముఖ విద్యాసంస్థలతోపాటు దేశంలోని 160 కాలేజీలు, యూనివర్సిటీలకు చెందిన వెయ్యి మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసాలను అమెరికా అధికారులు రద్దు చేశారు. ఇలా వీసా రద్దైన వారిలో చాలామంది భారతీయులు ఉన్నారు. వీసాల రద్దు లేదా స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సెవీస్) రికార్డుల నుంచి తొలగింపునకు గురైన అంతర్జాతీయ విద్యార్థులలో దాదాపు 50 శాతం మంది భారతీయులేనని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్(ఏఐఎల్ఏ) వెల్లడించింది.

# సంపాదకీయం

## కోట ఆత్మహత్యల రహస్యం ఛేదించేదెవరు?

విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా రాజస్థాన్ కోటలో నీట్ పరీక్షల కోచింగ్ వెళుతున్న విద్యార్థులు పిట్టల్లా రాలుతున్నారు. తాజాగా కాశ్మీర్‌కు చెందిన ఓ అమ్మాయి బలవన్మరణం చెందింది. ఇటీవలే కోట ఆత్మహత్యలపై సుప్రీం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. కోటలోనే ఎందుకు ఎక్కువగా ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నది భేతాళ కథల్లా మారింది. ఇప్పటి వరకు అక్కడ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో గుర్తించడం లేదు. గతంలో ఐఐటిల్ల వరుసగా ఆత్మహత్యలు కలవర పెట్టేవి. తరవాత మన తెలుగు రాష్ట్రాల్లో నారాయణ, చైతన్య కాలేజీల్లో చదువుకునే వారిలో ఆత్మహత్యలు కనిపించేవి. ఇప్పటికీ ఈ రెండు కాలేజీల్లో ఐఐట కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు అడపాదడపా ఆత్మహత్యలకు పాల్పడుతూనే ఉన్నారు. ఉన్నత విద్యావంతులు కావమెలా ఉన్నా అసలు ప్రాణాలు తీసుకుంటున్న విద్యార్థులతో తల్లిదండ్రులు గుండెశోకంతో తల్లడిల్లుతున్నారు.దేశంలో రాజస్థాన్ కోటా నీట్ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చేందుకు ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా ప్రచారంలో ఉంది. ఇక్కడ కోచింగ్ తీసుకున్న విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయని అనేక మంది భావిస్తుంటారు. ఈ ప్రాంతంలో ఇటీవల కాలంలో కోచింగ్ కోసం వచ్చిన విద్యార్థుల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్న తీరు ఆందోళన కలిగించేదిగా ఉంది. గతంలో ఇదే విషయంలో సుప్రీంకోర్టు సైతం అక్కడి రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించింది. ఈ సంవత్సరం కోటాలో జరిగిన 14 ఆత్మహత్యలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ విషయాన్ని తేలికగా తీసుకోకూడదని, తీవ్రంగా పరిగణించాలని కూడా చెప్పింది. ఈ విషయంలో కోటా ఎస్పీకి కూడా కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా మరో 18 ఏళ్ల విదార్థిని సూసైడ్ చేసుకుంది. జమ్మూ కశ్మీర్ నివాసి అయిన విద్యార్థిని జీషాన్ నీట్ కోసం ప్రిపేర్ అయ్యేందుకు నెల రోజుల క్రితం కోటాకు వచ్చారని మహావీర్ నగర్ పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. ఆ విద్యార్థిని మహావీర్ నగర్ ప్రతాప్ కూడలి వెనుక అద్దె ఇంట్లో ఉండేది. ఈ క్రమంలోనే అద్దె ఇంట్లోని ఒక గదిలో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో పోలీసులు ఆ విద్యార్థిని గురించి, ఆమె పరిచయస్తులు, స్నేహితుల గురించి సమాచారాన్ని సేకరిస్తున్నారు. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆ విద్యార్థిని చివరగా జమ్మూ కశ్మీర్‌లో బుర్హాన్ అనే వ్యక్తితో మాట్లాడుతున్నట్లు చెప్పారు. మాట్లాడుతూనే ఆ విద్యార్థిని తన గదికి వెళ్లిందన్నారు. ఆ క్రమంలో బుర్హాన్ తన ఫోన్ డిస్‌కనెక్ట్ చేసి, కోటాలో తనకు తెలిసిన ఒక అమ్మాయికి సమాచారం ఇచ్చి, జీషాన్ దగ్గరకు వెళ్ళమని అడిగినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆ పరిచయస్థురాలైన అమ్మాయి ఆమె ఇంటికి చేరుకునేసరికి, గది గేటు లోపలి నుంచి మూసి ఉంది. ఆ తరువాత, సమీప ప్రాంతాల వారికి విషయం తెలిపి గది డోర్ కట్టర్‌తో కత్తిరించగా, విద్యార్థిని లోపల ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఆ సమయంలో ఆత్మహత్య చేసుకున్న గదిలో ఉరిని నిరోధించే ఫ్యాన్స్ లేవని పోలీసులు చెబుతున్నారు. ఘటనా స్థలంలో పోలీసులకు ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదు. ఈ ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే కోటాలో ఫ్యాన్ సూసైడ్ మరణాలను నిరోధించేందుకు ఆ ప్రాంతాల్లోని హాస్టళ్లు సహా విద్యార్థులకు అద్దెకు ఇచ్చే గదుల్లో స్ప్రింగ్‌తో వేలాడే ఫ్యాన్లను అమర్చాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. వాటిని ఉపయోగించడం వల్ల ఫ్యాన్ సూసైడ్ మారణాలను అరికట్టవచ్చని తెలిపింది. కానీ ఈ విధానాన్ని అక్కడి వారు పాటించకపోవడం కూడా వారి మరణాలకు మరింత అవకాశాలు పెరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతోపాటు గతంలో నీట్ కోచింగ్ సమయంలో తక్కువ మార్కులు వచ్చిన వారిపై కూడా ఒత్తిడి పెరిగి ఆత్మహత్యలు చేసుకున్న కేసులు వెలుగులోకి వచ్చాయి. అయితే ఒత్తిడి వల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారా లేక మరేదైన కారణం ఉందా అన్నది అంతు చిక్కడం లేదు. ఈ దిశగా పోలీసులు కూడా పెద్దగా దర్యాప్తు చేపట్టడం లేదు. సుప్రీం ఆదేశాలతో కదులుతారా లేదా అన్నది కూడా అనుమానమే. ఇప్పటి విద్యార్థులకు పరీక్షలు వాటి ఫలితాలు జీవన్మరణ సమస్యలుగా మారాయి. నూటికి నూరు శాతం మార్కులు, అత్యుత్తమ ర్యాంకులు కొలబద్దలుగా నిలిచాయి. పోటీ ప్రపంచపు తూకపు రాళ్లలో ఒక్క గ్రాము అటు ఇటూ అయినా విద్యార్థులు బలవన్మరణా లకు పాల్పడుతున్నారు. కోటలోనే కాదు ఇంటర్, టెన్త్ ఫలితాలు తమకు అనుకూలంగా రాకున్నా విద్యార్థులు ఆత్మహత్యలకు తెగిస్తున్నారు. పరీక్షలో ఫెయిల్ కావడాన్ని తట్టుకోలేక పోతున్నారు. ఇకపోతే ఎపిలో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల తరువాత నలుగురు, ఇంటర్మీడియట్ ఫలితాల తరువాత ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వచ్చిన వార్తలే నిదర్శనం. వెలుగు చూడనివి ఇంకొన్ని ఉండవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక విద్యార్థి బలవన్మరణం పాలవుతున్నాడు. వీరిలో అత్యధికులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన వారేనన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ పోటీ ప్రపంచంలో విద్య, వైద్యం, గౌరవప్రదమైన జీవితం వంటి కనీస అవసరాలు సామాన్యులకు ఎండమావులుగా మారుతున్నాయి. వాటి కోసమే తల్లిదండ్రులు తమ చిన్నారులను పరీక్షల, ర్యాంకుల ఎడారుల్లో పరుగులు పెట్టిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పని చేసే టీచర్లు , అధ్యాపకులదీ ఇదే స్థితి. ఎప్పటికప్పుడు కొత్త ర్యాంకర్లను ఉత్పత్తి చేయకుంటే వేలాడుతున్న కత్తి వారి మెడమీద పడటం ఖాయం! ఈ భయోత్పాత స్థితే అభం, శుభం తెలియని పసిపిల్లలకు మరణశాసన మౌతోంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం పూనుకోవాలి. వాటిని ప్రాథమిక హక్కులుగా మార్చాలి. తమకు నచ్చిన అంశంపై విద్యార్థులు దృష్టి సారించాలి. పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. అందుకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్య! ఆ బాధ్యతను అవి నెరవేర్చకుంటే నిలదీయాలి. పోటీలు పడే విద్యను దూరం చేయాలి.


# సరళ సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు నీటి కాలువలను మరమ్మతులు చేయాలి

-కలెక్టర్ సురభి ఆదర్శ్ కి వినతి పత్రం
-రవి కుమార్ ఆర్టీఐ ఆక్టివిస్ట్, జిల్లా అధ్యక్షులు



**తెలంగాణవీణ వనపర్తి జిల్లా ప్రతినిధి.**
సరళ సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు సాగునీటి కాలువలకు వెంటనే మరమ్మతులు చేయాలనిసోమవారం రోజు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కి,సమాచార హక్కు చట్ట ఆక్టివిస్ట్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు జి.రవికుమార్ సోమవారం నాడు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వానాకాలం ప్రారంభమౌతోందని,ఆయకట్టు పరిధిలోని మదనాపురం, నెల్విడి, తిర్మలయాపల్లి, రామన్ పాడ్,ఆజ్జకొల్లు గ్రామంలో సాగునీటి కాలువలకు గతంలో చాలా చోట్ల లైనింగ్ దెబ్బతిని ధ్వంసం అయినాయని వెల్లడించారు. కాలువలో పూడికపేరుకుపోయి, కొట్టుకుపోయిన కాల్వలకు మరమ్మతులు ఎప్పుడు చేపడతారొనని సాగుకు సిద్ధమవుతున్న ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. వెంటనే మరమ్మతులకు నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారన్నారు. కాల్వలకు కొన్ని ఏళ్ల కిందట వేసిన సిమెంట్ లైనింగ్ దెబ్బతినడం ప్రవాహ ఉధృతికి పాడవడంతో తరచూ కాలువలకు గండ్లు పడుతున్నాయని గుర్తు చేశారురైతులే సొంత ఖర్చుతో తాత్కాలిక మరమ్మతు చేసుకొని,పంటలు కాపాడుకుంటున్నారన్నారు. ప్రతి ఏటా చివరి భూములకు నీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని,పంట కాలువలకు వచ్చే చిన్న చిన్న మరమ్మతులు వెంటనే నిర్వహించి చివరి వరకూ సాగునీరు అందేలా చూడాలన్నారు.వెంటనే అధికారులు దృష్టి సారించి పనులు చేపట్టాలని కోరారు.

# బక్రీద్ పండుగ ను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్ ఐ ఈ.శివ కుమార్ యాదవ్



**తెలంగాణవీణ పెద్దమందడి ప్రతినిధి**
బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంతంగా జరుపుకోవాలని పెద్దమందడి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఈ.శివకుమార్ యాదవ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూబక్రీద్ పండుగ సందర్భంగా గోవధ చేయవద్దనిప్రభుత్వం గోవధను పూర్తిగా నిషేధించిందని తెలిపారు.అపరిమితంగా పశువులను రవాణా చేయడంనేరమన్నారు ఎవరైనా గోవుల రవాణాకు పాల్పడితే,యువత కాని,ప్రజా సంఘాలు కానీ,సొంతంగా నిర్ణయాలు తీసుకోవద్దని వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.బుద్రవాగు నుండి పెద్దమందడి దారిలో హైవే దగ్గర చెక్ పాయింట్ ఏర్పాటు చేయడం జరిగిందని,వాహన తనిఖీ లో భాగంగా చెక్ పాయింట్ దగ్గర పోలీసులకు సహకరించాలని కోరారు.మండల పరిధిలో విస్తృతంగా డేగ కన్నుతో పెట్రోలింగ్ నిర్వహిస్తామని, గోవధను ముఖ్యంగా అరికట్టడము కోసమే తనిఖీలు నిర్వహిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.కుల,మతాల కు అతీతంగా పండుగలు నిర్వహించుకోవాలని అన్నారు.శాంతియుతంగా, ఆనందోత్సవాలతో జరుపుకొని, మతసామరస్యానికి పాటుపడాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో మత ఘర్షణలను ప్రేరేపించే ప్రచారాలు ఏమైనా వస్తే నమ్మవద్దని కోరారు. గోవుల రవాణా కానీ,అసాంఘిక కార్యకలాపాలు కాని, జరిగినట్లయితే,పెద్దమందడి ఎస్ఐ ఫోన్ నెంబర్: 87126 70623, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 100 కు గాని సమాచారం ఇవ్వాలని పెద్దమందడి మండల ప్రజలను కోరారు.

# నేటి తరం యువతకు ఆదర్శం రమేష్

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
-కంటి చూపు లేకపోయినా డిగ్రీ ఉత్తీర్ణత
-కంప్యూటర్ కోర్సులు పూర్తి..
-దివ్యాంగుడి కోటాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతోపాటు.. పెన్షన్ అందించిన ఎమ్మెల్యే జీఎంఆర్



**తెలంగాణవీణ పటాన్ చేరు ప్రతినిధి**
కంటి చూపు లేకపోయినా అనుకున్న లక్ష్యాన్ని సాధించడమే ధ్యేయంగా మొక్కవోని దీక్షతో గ్రాడ్యుయేషన్ తో పాటు మూడు కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసిన దివ్యాంగుడు రమేష్ జీవితం నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకమని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు పటాన్చెరు పట్టణానికి చెందిన రమేష్ తొమ్మిదవ తరగతి చదివే సమయంలో కంటి చూపు కోల్పోయాడు. ఉన్నది చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యం నీరుగారిపోవడంతో తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారు.ఈ నేపథ్యంలో స్థానిక రైల్వే ఉద్యోగి.. మైత్రి క్రికెట్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి రమేష్ పరిస్థితిని తెలుసుకొని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో వెన్నంటి నిలిచారు. పదవ తరగతితో పాటు పటాన్చెరు పట్టణంలోని డాక్టర్ అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాలలో ఓపెన్ డిగ్రీ చదివేల ప్రోత్సహించి.. ఉత్తీర్ణత అయ్యేలా సహకరించారు. రైల్వే డిపార్ట్మెంట్లోని అంద ఉద్యోగుల సహకారంతో వివిధ కంప్యూటర్ కోర్సులు పూర్తిచేసేలా కృషి చేశారు అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో.. దివ్యాంగుల కోటాలో. ప్రభుత్వ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు ప్రభుత్వ పెన్షన్ అందించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు రమేష్. తన ఉన్నతికి వెన్నంటి నిలుస్తూ సంపూర్ణ సహకారం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ జీవితంలో ఒక లక్ష్యం నిర్దేశించుకోవడం అంటే, మనం సాధించాలనుకున్నది ఏమిటో స్పష్టంగా తెలుసుకోవడమణి.. ఈ అంశంలో రమేష్ కంటి చూపు లేకపోయినా లక్ష్యాన్ని నిర్దేశించుకుని అకుంఠిత దీక్షతో పూర్తి చేశారని అభినందించారు రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించేలా శిక్షణ ఇప్పించడంతోపాటు.. తాత్కాలికంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రమేష్ విజయంలో శిక్షకుడిగా సహకారమందించిన మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డిని అభినందించారు.

# మహమ్మద్ ప్రవక్త పై కించపరిచే వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ చిలుక ప్రవీణ్ పై పిడి యాక్ట్ నమోదు చేయాలి

నగర ఏసీపికి ఫిర్యాదు చేసిన ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు గులాం అహ్మద్, మాజీ కార్పొరేటర్ల డిమాండ్

**తెలంగాణవీణ కరీంనగర్,**
ఇస్లాం ప్రియ ప్రవక్త మహనీయ మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వీడియో ప్రసారం చేసిన హైదరాబాద్ కు చెందిన యూట్యూబర్ చిలుక ప్రవీణ్ పై, తక్షణమే అరెస్టు చేయాలని భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయకుండా, ఇలా విద్వేషాలు రగిల్చే వారికి గుణపాఠం వచ్చేలా పిడి యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో కరీంనగర్ నగర ఏసిపి ఎన్. వెంకటస్వామికి, మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ మాట్లాడుతూ.. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు తాము ఈ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. చిలుక ప్రవీణ్ అనే వ్యక్తి కేవలం మత విద్వేషాలు రెచ్చగొట్టడమే పనిగా, మహనీయ ఇస్లాం ప్రియ ప్రవక్త ముహమ్మద్ పై, కనీస అవగాహన లేకుండా, సోషల్ మీడియాలో ఫేమస్ కావడం కోసం తన యూట్యూబ్ వ్యూస్ పెరగడం కోసం, అసత్య ప్రచారానికి దిగి, అసభ్యకరమైన పదజాలాన్ని వినియోగించాడాని, ఇలాంటి చర్యలను ఎంఐఎం పార్టీ ముక్తకంఠంతో తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇతడు యూ న్యూస్ అనే యూట్యూబ్ ఛానెల్‌ను నడుపుతూ, మత ద్వేషాన్ని రెచ్చగొట్టేలా, ముస్లిం సమాజాన్ని అవమానపరిచేలా..ఇస్లాం చివరి ప్రియ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గురించి అశాస్త్రీయంగా, అవమానకరంగా మాట్లాడుతున్నాడని ఇతడికి తగిన గుణపాఠం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి డిజిపి కి, సిపికి విజ్ఞప్తి చేశారు. ఇతని వ్యాఖ్యలు కేవలం ముస్లింలనే కాకుండా, దేశంలోని మత సామరస్యాన్ని పూర్తిగా భంగపరచే ప్రమాదంలో నెట్టేలా ఉన్నాయని, చిలుక ప్రవీణ్ పై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని వెంటనే కోరారు.

# అక్రమంగా బీ కేటగిరి సీట్లను అమ్ముకుంటున్న ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలపై చర్య తీసుకోవాలి.



**తెలంగాణ వీణ/ఓయూ:** తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం ని కలిసి హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ నుండి ఎటువంటి అధికారిక నోటిఫికేషన్ లేదా అనుమతి లేకుండా, కొన్ని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు బి-కేటగిరి ప్రవేశాలను నిర్వహిస్తున్నాయి. ఈ ప్రవేశ ప్రక్రియలో పారదర్శకత లోపిస్తుంది. ఈ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి గుర్తింపును రద్దు చేయాలని కోరడం జరిగింది.అనేక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ నుండి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా లేదా అనుమతి లేకుండా తమ ఫీజులను పెంచుతున్నాయి. ఈ విధమైన పెంపులు ఆర్థికంగా బలహీనమైన మరియు మధ్య తరగతి విద్యార్థులపై తీవ్రమైన భారం వేస్తాయి. దీనిని కఠినంగా నియంత్రించాలి.బయోమెట్రిక్ హాజరును అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థులు మరియు అధ్యాపకులందరికీ తప్పనిసరిగా చేయాలి. ఇది విద్యా ప్రమాణాలను కాపాడడంలో మరియు రెగ్యులర్ హాజరును నిర్ధారించడంలో సహాయపడుతుంది.అన్ని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలపై పూర్తి స్థాయి తనిఖీలు జరపాలని మేము కౌన్సిల్‌ను కోరుతున్నాము. విద్యా ప్రమాణాలు పాటించని కళాశాలలపై కఠినమైన చర్యలు తీసుకోవాలి , వాటి గుర్తింపును రద్దు చేయాలి. ఇంజనీరింగ్ విద్య అందరికీ అందుబాటులో ఉండేందుకు, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు, ఫీజు తగ్గింపు చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక ( టీ వీ యు వీ) చైర్మన్ కంచర్ల బద్రి గారు, తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ( టీజీ ఆర్ ఎస్ ఏ) డాక్టర్ పొన్నం ముత్యం గౌడ్ గారు, బహుజన విద్యార్థి సంఘం( బీ వీ ఎస్) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ జనగామ సంతోష్ గారు పాల్గొన్నారు

# డ్రైవర్ జితేంద్ర కి రావలసిన వేతనం ఇప్పించిన

**-బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి**



**తెలంగాణ వీణ...** మేడ్చల్ నియోజకవర్గంలోని పూడూరు లో" బాలాజీ ట్రాన్స్ పోర్ట్"లో జితేంద్ర అనే డ్రైవర్ గత కొన్ని సంవత్సరాలుగా డీసీఎం డ్రైవర్ గా పని చేయడం జరుగుతుంది... కొన్ని అనివార్య కారణాల వల్ల ఓనర్ హర్షవర్ధన్ డ్రైవర్ జితేంద్ర నీ డ్యూటీ లో నుంచి తీసివేయడం జరిగింది... "బాలాజీ ట్రాన్స్ పోర్ట్" లో ఓనర్ హర్షవర్ధన్, జనవరి,ఫిబ్రవరి రెండు నెలల మొత్తం వేతనం 45 వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకుండా డ్రైవర్ జితేంద్ర ని ఇబ్బంది పెడుతూ రావలసిన మొత్తం వేతనం ఇవ్వకుండా దుర్భాషలాడి అతని బెదిరించి పంపించేవాడు అతనికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి డ్రైవర్ మిత్రుల ద్వారా తెలుసుకొని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అతని కార్యాలయం వద్దకు వెళ్లి డ్రైవర్ జితేంద్ర కి జరిగిన అన్యాయం గురించి చెప్పుకున్నాడు.. ఆ తర్వాత వెంటనే స్పందించిన రవి హుటాహుటిన బాలాజీ ట్రాన్స్ పోర్ట్ ఓనర్ హర్షవర్ధన్ దగ్గరికి వెళ్లి అతని తో మాట్లాడి జితేంద్ర కి రావలసిన వేత్తనం గురించి మాట్లాడి రావలసిన వేత్తనం జనవరి, ఫిబ్రవరి రెండు నెలల వేత్తనం మొత్తం 45 వేల రూపాయలు. డ్రైవర్ జితేంద్ర కి ఇప్పించడం జరిగింది... డ్రైవర్ జితేంద్ర, మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు... ఈ కార్యక్రమంలో... అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యత ప్రచారం

**-ప్రభుత్వ బడులు నిలబడాలి చదువుల్లో అంతరాలు పోవాలి**
**-మిర్యాలగూడ చేరిన ప్రచార జాతర**
**-మాజీ ఎమ్మెల్సీ పౌరస్ స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు అలుగుబెల్లి నర్సిరెడ్డి**



**తెలంగాణ వీణ,మిర్యాలగూడ...** ప్రభుత్వ బడులు నిలబడాలి, చదువుల్లో అంతరాలు పోవాలి, ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ స్కూల్స్ ప్రారంభించాలని కోరుతూ తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతర మంగళవారం మిర్యాలగూడకు వరకు చేరుకుంది. స్థానిక అమరవీరుల స్థూపం వద్ద జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ పౌరస్ స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో అంతరాలు లేని విద్య రావాలని, ప్రీ ప్రైమరీ స్కూల్స్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తరగతికి ఒక గది ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడి ఈడు పిల్లల సంఖ్య ఆధారంగా గ్రామీణ ప్రాంతంలో పాఠశాలలన్నీ వి ఆర్గనైజ్ చేయాలన్నారు. ఇతర ఆవాస్ నుండి బడికి రావాల్సిన విద్యార్థుల కొరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో విద్యకు పది శాతం కేటాయించాలని తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ఏర్పాటుకు కేంద్రం 5వేల కోట్లు ప్రత్యేక గ్రాంట్లు ఇవ్వాలన్నారు. క్రమంగా అంతరాలు లేని బడులను అభివృద్ధి చేసి ఉన్నోడు పల్లలైనా, లేనోడు పిల్లలైనా ఒకే బడిలో ఒకే తరగతి గదిలో చదువుకునే పరిస్థితులు కల్పించారు. పౌర సమాజం మేల్కొని ప్రభుత్వ పాఠశాలల బలోపేతకు సహకరించాలని కోరారు. ఈ జాతకు ఆయా ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో టీపీఎస్సీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఆర్ ధనమూర్తి, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి నాగమణి, జిల్లా అధ్యక్షులు బి శ్రీనివాస్ చారి, జిల్లా కార్యదర్శులు ఎం శ్రీనివాస్ రెడ్డి, ఏ. చిన్న వెంకన్న, జి. వేదశ్రీ, టాప్రా నాయకులు పి. రమణారెడ్డి, పి సత్యనారాయణ రావు, ఎల్. మాధవరెడ్డి, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు రామయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి నాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సైదా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# వయసేమో చిన్నది కానీ ఈ వికలాంగుడి మనసేమో పెద్దది

**-హైదరాబాద్ హైకోర్టు న్యాయవాది సద్గుణ రెడ్డి & శ్రీమంత్ రెడ్డి పెళ్లిరోజు సందర్భంగా వేములవాడ రాజన్న మెట్లపైన వారి పేరు మీద అరటి పండ్లు పంపిణీ చేసి అభిమానం చాటుకున్న వికలాంగుడు ఓదెల నరేష్**



తన స్వంత అక్కల భావించుకున్న ఓదెల నరేష్

**తెలంగాణ వీణ,సిరిసిల్ల...** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన వికలాంగుడు ఓదెల నరేష్ ఇతను వేములవాడ లో 10 సంవత్సరాలనుండి ఒక అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు ఈ రోజు సద్గుణ రెడ్డి మంగళవారం తన పెళ్ళి రోజు సందర్భంగా వారి పేరు మీద అర్చన చేహించి తదనంతరం దాదాపు 30 మందికి అరటిపండ్లు పంపిణీ చేసారు నాకు సద్గుణ రెడ్డి 01-01-2021 రోజున కరీంనగర్ లో కళ భారతి లో నాకు పరిచయం అయ్యారు అప్పటి నుండి ఇప్పటి వరకు అక్క తమ్ముడు ల ఉన్నాము మా ప్రేమాభిబంధం ఎప్పటికి ఇలానే ఉండాలని నరేష్ గుర్తు చేసుకున్నారు.భగవంతుడు వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని వికలాంగులు నరేష్ కోరుతున్నాడు.

# చిన్నక్రాంతి కాలనీ ని ఒక మోడల్ కాలనీ గా తీర్చిదిద్దుతా

**-మేడ బాపురాజు ఫ్యానల్**





**తెలంగాణ వీణ/నాచారం:** చిన్నక్రాంతి కాలనీ ని ఒక మోడల్ కాలనీ గా తీర్చిదిద్దుతామని బాపురాజు ఫ్యానల్ అభ్యర్థులు మేడ బాపురాజు, రాజేందర్ రెడ్డి,శివ తెలిపారు. చిన్నక్రాంతి కాలనీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో అభ్యర్థులు ప్రచార జోరు పెంచారు.గడప గడపకు వెళ్లి తమకే ఓటు వేయాలంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో అపోజిషన్ ప్యానెల్ అభ్యర్థులు తలమునకలవుతున్నారు ఎన్నికలు సమీపించడంతో తమ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బాపురాజు ప్యానెల్ సభ్యులు కాలని వాసులకు విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా కాలనీ వాసులు తెలిపిన సమస్యలను స్వీకరిస్తూ... మా ప్యానెల్ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.అభ్యర్థులు ఇంటింటి ప్రచారాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ ఓట్లును అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థుల ప్రచారాల పర్వం ఊపందుకుంది.ఈ కార్యక్రమంలో నిలుగొండ వెంకటేష్ గౌడ్,గొరిగే నరసింహ కురుమ, నల్లగంటి నరేశ్, పోలిశెట్టి సతీష్,శ్రీనివాస్, విక్రమ్ గౌడ్,రామరాజు, మస్తాన్ భాస్కర్,సంపత్,ఆర్ల ప్రవీణ్, నవీన్ రెడ్డి,సంజీవ్,ప్రశాంత్,రాజు గౌడ్,శ్రీనివాస్ చారి, శేఖర్ రెడ్డి, రవీందర్,ప్రవీణ్,శ్రీకాంత్,సతీష్, చిందాల మల్లేష్, జగదీష్, పాలడుగు రమేష్,మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు లో పాల్గొన్న సికింద్రాబాద్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు తర్నకడివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్ కుమార్.






**తెలంగాణ వీణ/తార్నాక:** కడపలోని మహానాడు లో పాల్గొన్న సికింద్రాబాద్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు తర్నకడివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్ కుమార్, అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు కాత విజయ్ కుమార్,నాలుబందు శ్రీనివాస్, టీ ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు టి.రవీందర్, టి టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సంధ్య పోగు రాజశేఖర్ , విక్రమ్ , రామారావు , పాల్గొనడం జరిగింది

# చిలుక నగర్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు...

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**తెలంగాణ వీణ,ఉప్పల్...** చిలుక నగర్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల కోసం నూతన భవనం ఏర్పాటు కోసం హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ యోగిత రాణా ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చిలుక నగర్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం స్కూల్ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నర్సింహా రెడ్డి గారిని గతంలో కలవగా నూతన భవనం ఏర్పాటు కోసం నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తన దృష్టికి తీసుకురాగా ఈ రోజు అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు వచ్చిన ఫైల్ ని వెంటనే సాంక్షన్ చేయాల్సిందిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, యోగితా రానా ను కోరడం జరిగింది. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రానా సానుకూలంగా స్పందిస్తూ వీలైనంత త్వరలో బడ్జెట్ అప్రూవల్ చేయించి శాంక్షన్ కి పంపుతానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## నెహ్రూ గారి సేవలు ఎన్నటికి మరువలేనివి

–తెలంగాణ రాష్ట్ర NSUI నాయకుడు గొల్ల జాన్



**తెలంగాణ వీణ...**
ఈ రోజు భారత మొదటి ప్రధాని స్వర్గీయ పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా, తెలంగాణ NSUI తరపున, గాజులరామరం కేర్ & లవ్ అనాథాశ్రమంలో పిల్లలతో కలిసి ఆయన ఫోటోకు నివాళులర్పించి, పండ్లు మరియు బిస్కెట్లు పంపిణీ చేసాము.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర NSUI నాయకుడు గొల్ల జాన్ మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ గారు దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లిన నాయకుడని, బ్రిటిష్ వారు దేశాన్ని పూర్తిగా దోచుకున్న తర్వాత భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నెహ్రూ గారు భారత దేశంలో ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించారాని ,పంచవర్ష ప్రణాళిక ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారని ఆయన అన్నారు.నెహ్రూ భూపునఃపంపిణి విధానాన్ని అనుసరించడంతో పాటు నీటిపారుదలకు కాలువలు త్రవ్వించడం, ఆనకట్టలు కట్టించడం , వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపట్టారాణి ఆయన తెలిపారు. ఎయిమ్స్, ఐఐటీ లు,csir ల్యాబ్లు మరియు అంతరిక్షం , అణు కార్యక్రమాలు వంటి సంస్థలు నెహ్రూ గారి దృష్టి మూలంగా వచ్చాయని, నెహ్రూ గారి విధానాలను ఆశయాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాలని ప్రజలకు తెలియజేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జాయింట్ సెక్రటరీ కుందన్ యాదవ్, రాష్ట్ర నాయకుడు పృథ్వీ రాజ్, NSUI నాయకులు జీవన్ రాథోడ్, ఉదయ్, నవీన్ గౌడ్, దేవేందర్, సాద్విక్ మరియు తదితరులు పాల్గొన్నారు

## ఈజీ ఎం ఎం ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా





**తెలంగాణ వీణ,వికారాబాద్ జిల్లా...**
వికారాబాద్ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 29న తాండూరులో నిర్వహించే జాబ్ మేళాను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఈనెల 29న తాండూర్ లో నిర్వహించే జాబ్ మేళా పై తాండూరు శాసన సభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి తో కలిసి జిల్లా అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సదుద్దేశంతో ఉపాధి కల్పన మరియు మార్కెటింగ్ మిషన్ (ఇజీఎంఎం) ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా ను నిర్వహించడం జరుగుతుందన్నారు. 52 పారిశ్రామిక రంగాల్లో 11 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 29న తాండూర్ లో నిర్వహించే జాబ్ మేళాను ప్రతిష్టాత్మకంగా తీసుకొని జాబ్ మేళాకు విచ్చేసే నిరుద్యోగులకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. తాండూరు శాసన సభ్యులు బి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంకల్పం మేరకు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో తాండూర్ లోని వినాయక కన్వెన్షన్ నందు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు సమాచారాన్ని చేర వేసేందుకు అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. నిరుద్యోగులకు ఇలాంటి జాబ్ మేళాల ద్వారా మంచి అవకాశాలు కల్పించే వారమవుతామని ఆయన అన్నారు. జాబ్ మేళాలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా స్టాళ్లను ఏర్పాటు చేసి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సమన్వయ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఇజీఎంఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణన్, జెడిఎం సతీష్, తాండూర్ సిడిపిఓ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, ఎంపీడీవోలు, ఎంపిఓలు పాల్గొన్నారు.

## తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా టి. డబ్ల్యూ. జె .ఎఫ్ .సభ్యత్వ నమోదు కార్యక్రమం



**తెలంగాణ వీణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా...**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం మణుగూరు మండలంలో .టి .డబ్ల్యూ .జె .ఎఫ్ .ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జర్నలిస్టుల సమస్యలపై ఉద్యమంతో పాటు, సభ్యత్వాన్ని విస్తృతం చేసేందుకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ .టి .డబ్ల్యు. జె .ఎఫ్. భారీ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించింది. మంగళవారం మణుగూరు పట్టణంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ, “తెలంగాణ ఉద్యమంలో పాత్ర పోషించిన జర్నలిస్టులు, కొత్త రాష్ట్రంలో గుర్తింపు పొందాల్సిన అవసరం ఉంది. గత బీఆర్ఎస్ హయాంలో జర్నలిస్టుల సమస్యలు తీవ్రంగా నిర్లక్ష్యం చేయబడ్డాయి. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై జర్నలిస్టుల హక్కుల కోసం న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాం” అన్నారు.అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇల్లు, స్థలం, హెల్త్ కార్డు, అక్రిడిటేషన్ కార్డు లభించాలన్నది టి .డబ్ల్యూ .జె. ఎఫ్ .ప్రధాన డిమాండ్. వీటి అమలుపై ప్రభుత్వం స్పందించకపోతే, దశలవారీగా న్యాయ పోరాటం చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు తమ సభ్యత్వాలు నమోదు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పూదోట సూరిబాబు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిర్రా శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు డి. రవికుమార్, మణుగూరు ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ వన్నం కృష్ణమోహన్, ఇతర ప్రముఖ జర్నలిస్టులు జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు .టీవీ. 5.పొన్నగంటి కృష్ణ .టీవీ .99 .అన్నదేవర వెంకటాచారి. మహా టీవీ. తెలగంశెట్టి. రాము. భరత్ టుడే. పొదిల. సుబ్బారావు (సామాజిక తెలంగాణ), వై. వీరప్రసాద. 4 సైడ్స్. టీవీ. జేమ్స్ దిశా టీవీ. ప్రసాద్. వి 10 .పాల్గొన్నారు.టి. డబ్ల్యూ .జె. ఎఫ్. ఆధ్వర్యంలో జర్నలిస్టుల సాధికారత కోసం రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు శరవేగంగా కొనసాగుతోంది. ప్రతి మీడియా జర్నలిస్టు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఫెడరేషన్ పిలుపునిచ్చింది.


## భౌగోళిక తెలంగాణ మాత్రమే ఏర్పాటైంది.



**తెలంగాణ వీణ/తార్నాక:**
భౌగోళికంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందనీ సామాజిక తెలంగాణ ఇంకా ఏర్పాటు కాలేదనీ ఇది చాలా బాధాకరం అని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్(ఎన్సిసి) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బిషప్ సంజయ్ ఆనంద్ అన్నారు. సమానత్వంలోని సమాజంలో మనమంతా బ్రతుకుతున్నామనీ ఇది చెప్పడానికి చింతిస్తున్నామన్నారు. ఈ మేరకు మంగళవారం లాలాపేటలోని లోగోస్ గాస్పల్ చర్చిలో ఎన్సిసి రాష్ట్ర స్తాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ తెలంగాణలో ఏర్పాటైన సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రం వ్యాప్తంగా జూలై 2న ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలనీ పిలుపునిచ్చారు. హైదరాబాద్లో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ఎన్సి పాటుపడుతుందన్నారు. దేశ వ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను కాపాడాలనీ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. మత ఘర్షణలకు తావు లేకుండా ఎన్సిసి పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెవరెండ్ బక్క ఏలియా. మహిళా అధ్యక్షురాలు ప్రసన్న బోల్డ్, కౌన్సిల్ సభ్యులు రెవరెండ్ గడిపే సుదర్శన్, సునీల్, ప్రీతి తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

## తల్లాడ వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో ....


### పోలీస్ కానిస్టేబుల్ బాలాజీకి ఘన సన్మానం ...



**తెలంగాణ వీణ,తల్లాడ...**
ఇటీవల తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్స్ బదిలీలో భాగంగా తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నటువంటి బానోతు బాలాజీ ఖమ్మం ట్రాఫిక్ విభాగానికి బదిలీ అయిన విషయం తెలిసిందే. మండలంలో అన్ని వర్గాల ప్రజలకు విధి నిర్వహణలో అందుబాటులో ఉంటూ ఫ్రెండ్లీ పోలీసుగా పేరొందిన బాలాజీకి మంగళవారం స్థానిక వాలీబాల్ క్లబ్ నేతృత్యంలో క్లబ్ అధ్యక్షులు కృష్ణ అధ్యక్షతన గణ సన్మానం జరిగింది..ఈ సన్మాన కార్యక్రమంలో తల్లాడ వాలీబాల్ క్లబ్ ఫార్మేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జివిఆర్,మరి కొంతమంది క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సన్మాన కార్యక్రమాన్ని పురస్కరించుకొని క్లబ్ సభ్యులు బాలాజీకి పుష్ప గుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు, స్వీట్స్ పంచారు.అనంతరం వారు మాట్లాడుతూ తల్లాడ పోలీస్ స్టేషన్ లో ప్రజలకు మీరందించిన సేవలు అమోఘమని మంచి మనసున్న పోలీస్ గా ప్రజల హృదయాలను గెలుసుకున్నారని విధి నిర్వహణలో భాగంగా మీరు మా దగ్గర నుండి బదిలీ అయ్యి వేరే ప్రాంతానికి వెళ్లడాన్ని మేము జీర్ణించుకో లేకపోతున్నామని, అయినా విధి ధర్మం పాటించాల్సిన బాధ్యత భారతీయ పౌరునిగా మనందరికీ,అదేవిధంగా బదిలీపై వెళ్తున్న బాలాజీకి ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ వాలీబాల్ క్లబ్ వ్యవస్థాపకులు జి.వి.ఆర్, క్లబ్ అధ్యక్షులు కృష్ణ, సభ్యులు షేక్ మేహారాజ్, సైదులు,ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు..

## అమావాస్య సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ముఖ్యఅతిథిగా పాల్గొన్న

### మాజీ తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా.





**తెలంగాణ వీణ,యాదాద్రి భువనగిరి జిల్లా...**
చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో చౌటుప్పల్ మండలం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. మంగళవారం అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ అన్నదానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ... అన్ని దానాలలో కెల్లా అన్నదానం మహా గొప్పది అని అన్నారు. అన్నదానం నా చేతుల మీద ప్రారంభించడం నా జన్మ ధన్యమైనదని అన్నారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తాను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్య వైశ్యులు మంచిగంటి భాస్కర్ , సోమారం సత్తయ్య, కామిశెట్టి చంద్రశేఖర్, పాలడుగు వెంకటేశం, నాంపల్లి శ్రీనివాస్, దాచేపల్లి శ్రీనివాస్, తడకమళ్ళ శ్రీనివాస్, దాచేపల్లి రాజు, విజయ్, కామిశెట్టి ప్రభాకర్, గజ్జల భాస్కర్, గోరంటి నరసింహరాజు, మంచి కంటి రమేష్ ,చెరుకు అశోక్, గట్టు రఘు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో వ్యక్తి మృతి



**తెలంగాణ వీణ,సోన్...**
సోన్ మండల కేంద్రానికి చెందిన మృతుడు గోలి సుదర్శన్, తండ్రి బద్దన్న, వయసు.30 సంవత్సరాలు, నివాసం: సోన్ ఇతను అందాజా ఆరునెలల క్రితం విదేశాల నుంచి తిరిగి వచ్చి తనకు వివాహం జరుగుతలేదని మనస్థాపం చెంది మద్యానికి బానిసై మంగళవారం ఉదయం తెల్లవారుజామున అందాజా 04.00 గంటల సమయంలో తన ఇంటి లోపల కొక్కే నికి నైలాన్ త్రాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడనిఅని తన తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన్ ఎస్సై కె.గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది

# బిజినెస్

# వోల్వో కార్ల కంపెనీలో 3000 మంది ఉద్యోగుల తొలగింపు

**తెలంగాణవీణ, బిజినెస్**


స్వీడెన్‌కు చెందిన వోల్వో కార్ల కంపెనీ సుమారు మూడు వేల మంది ఉద్యోగులను తొలగించనున్నది. ఖర్చులను తగ్గించే ఉద్దేశంతో ఆ కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నది. వాణిజ్య ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చిత వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొన్నది. స్వీడెన్‌లో ఉన్న సుమారు 1200 మంది వర్కర్లను తొలగించనున్నారు. ఇక ఆ దేశంలోనే పనిచేస్తున్న మరో వెయ్యి మంది కన్సల్టెంట్లను కూడా తొలగించేందుకు ఆ కంపెనీ నిర్ణయించింది. ఇక మిగితా జాబ్‌లన్నీ ఇతర దేశాల్లో ఊడనున్నాయి. ఎక్కువ శాతం ఆఫీసు పొజిషన్లలో ఉన్నవారిని తొలగిస్తారు. తాము ప్రకటించిన నిర్ణయాలు



కష్టమైనవని, కానీ బలమైన నిర్మాణంచేపట్టేందుకు అవే కీలకమైన అడుగులు అని వోల్వో కార్ల కంపెనీ సీఈవో హకన్ సామ్యుల్సన్ తెలిపారు. ఆటోమోటివ్ పరిశ్రమ సవాళ్లను ఎదుర్కొంటున్నదని, నగదు రాకను పెంచాలని, అదే విధంగా ఖర్చులను తగ్గించాలన్నారు.

## కొనుగోలుదారులకు భారీ రిలీఫ్ ఇచ్చిన పసిడి ధర..!

### హైదరాబాద్‌లో తులం ఎంత పలుకుతుందంటే..?




**తెలంగాణవీణ, బిజినెస్**

పుత్తడి ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. మంగళవారం ధరలు తగ్గాయి. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రూ.800 తగ్గి పది గ్రాములకు రూ.98,500 పలుకుతున్నది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ సైతం ధ్రువీకరించింది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర సైతం రూ.800 తగ్గడంతో తులానికి రూ.98వేలు పలుకుతుందని పేర్కొంది. అదే సమయంలో వెండి ధరలు సైతం భారీగానే పడిపోయాయి. రూ.1,370 తగ్గి.. కిలోకు రూ.99వేలు పలుకుతున్నది. వెండి సోమవారం కిలోకు రూ.లక్షపైగానే ట్రేడ్ అయ్యింది. యుఎస్, బ్రస్సెల్స్ మధ్య వాణిజ్య చర్చలు ధరలపై ప్రభావం చూపాయి. మరో వైపు ప్రపంచవ్యాప్తంగా స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 45.03 తగ్గి ఔన్సుకు 3,296.92 చేరాయి.అమెరికాతో వాణిజ్య చర్చలను వేగవంతం చేయాలని బ్రస్సెల్స్ ఒత్తిడి చేస్తుండడంతో విలువైన లోహానికి డిమాండ్ స్వల్పంగా తగ్గిందని కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా తెలిపారు. సుంకాలు, ద్రవ్యోల్బణం ఆందోళనల మధ్య పెట్టుబడిదారులు యూఎస్ డ్యూరబుల్ గూడ్స్ ఆర్డర్ అండ్ కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ డేటాపై దృష్టి సారించారని.. డేటాలోని గణాంకాలు ఆర్థిక దృక్పథం గురించి మరింత సమాచారం తెలుస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల పసిడి రూ.89,950 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం రూ.98,130 పలుకుతున్నది. కిలో వెండి రూ.1.11లక్షలుగా ఉన్నది. ఇక ప్లాటినం తులం ధర రూ.29,930 వద్ద కొనసాగుతున్నది.

## ఈ ఏడాది 5 వేల నియామకాలు..
## గుడ్‌న్యూస్ చెప్పిన ఇ-కామర్స్ దిగ్గజం

**తెలంగాణవీణ, బిజినెస్**

ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, టారిఫ్ వార్, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. అయితే, వాల్‌మార్ట్‌కు చెందిన ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ మాత్రం ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఈ ఏడాది వేల సంఖ్యలో నియామకాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది 5 వేల మందిని నియమించుకోనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని తాజాగా కంపెనీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఫ్లిప్‌కార్ట్ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ సీమా నాయర్ ఈ నియామక




ప్రణాళికలను ప్రకటించారు. క్విక్ కామర్స్, ఫిన్‌టెక్, కృత్రిమ మేధ రంగాల్లో విస్తరణపై దృష్టి సారించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

తెలిపారు. ఇప్పటికే 'మినిట్స్' పేరిట క్విక్ కామర్స్ సేవలు అందిస్తున్న ఫ్లిప్‌కార్ట్ తన వ్యాపారాన్ని వేగంగా విస్తరిస్తోంది. వినియోగదారులకు వేగవంతమైన డెలివరీ సేవలు అందించేందుకు కృషి చేస్తోంది. యూపీఐ పేమెంట్స్ జరిపేందుకు సూపర్.మనీ పేరుతో తీసుకొచ్చిన అప్లికేషన్‌పై దృష్టి సారించింది. ఈ విభాగాల్లో డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో నూతన నియామకాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నట్లు

## క్రికెట్‌లో సంచలనం.. 2 పరుగులకే 10 వికెట్లు!

**తెలంగాణవీణ, క్రీడలు :**

ప్రపంచ క్రికెట్‌లో మరో సంచలనం. అలాఅనీ బ్యాటర్లు సెంచరీలతో రికార్డుల మోత మోగించలేదు. కానీ, ఒక టీమ్ స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయిన జట్టుగా చెత్త రికార్డు మూటగట్టుకుంది. భారీ ఛేదనలో ప్రత్యర్థి బౌలర్ల దెబ్బకు కేవలం 2 పరుగులకే 10 వికెట్లు కోల్పోయింది ఒక జట్టు. ఈ రెండు పరుగుల్లో ఒకటి వైడ్ రూపంలో వచ్చిందే. అంటే.. సదరు టీమ్ ఒకే ఒక రన్ చేసి ఆలౌటయ్యింది. దాంతో, ఇదేంటీ? అని అభిమానులు నోరెళ్లబెడుతున్నారు. అసలు అదేలా సాధ్యం అనుకుంటున్నారా.. అయితే.. యూకే క్లబ్ క్రికెట్‌లో జరిగిన ఈ మ్యాచ్ సంగతులు మీరు తెలుసుకోవాల్సిందే.ఈ టీ20 యుగంలో బ్యాటర్లు విధ్వంసక బ్యాటింగ్‌తో అలరిస్తుంటే.. యూకే క్లబ్ క్రికెట్ జట్టు రిచ్‌మండ్స్ ఫోర్త్ ఎక్స్ఐ క్రికెటర్లు మాత్రం ఘోరంగా విఫలమయ్యారు. దాంతో, మిడిల్‌సెక్స్ లీగ్‌లో భాగంగా మే 24న నార్త్ లండన్ తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 2 పరుగులకే



కుప్పకూలింది. ప్రత్యర్థి నిర్దేశించిన 427 పరుగుల ఛేదనలో రిచ్‌మండ్స్ ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది.నార్త్ లండన్ ఆటగాళ్లు రెచ్చిపోయి ఆడిన చోట రిచ్‌మండ్స్ ప్లేయర్లు మాత్రం తేలిపోయారు. వచ్చినవాళ్లు వచ్చినట్టు పెవిలియన్ చేరారు. ఒకరిద్దరు కాదు ఏకంగా 9 మంది డకౌట్ అయ్యారు. 5.4 ఓవర్లలోనే ఆ జట్టు రెండంటే రెండే పరుగులకు 10 వికెట్లు కోల్పోయి భారీ ఓటమి ఖాతాలో వేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన నార్త్ లండన్ 45 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 426 పరుగులు చేసింది. ఇందులో రిచ్‌మండ్స్ బౌలర్లు 98 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం గమనార్హం.

# స్పోర్ట్స్

## ఐపీఎల్ ఫైనల్‌కు త్రివిధ దళాధిపతులను ఆహ్వానించిన బీసీసీఐ



**తెలంగాణవీణ, క్రీడలు :**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ జూన్ 3వ తేదీన అహ్మదాబాద్‌లో జరగనున్నది. అయితే ఆ ఫైనల్ కు త్రివిధ దళాలకు చెందిన అధిపతులను ఆహ్వానించినట్లు బీసీసీఐ ఇవాళ చెప్పింది. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతీయ రక్షణ దళాలు ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల స్థావరాలను ఆపరేషన్ సింధూర్‌తో ధ్వంసం చేశారు. వాస్తవానికి ఆ ఆపరేషన్ చేపట్టి సమయంలో ఐపీఎల్ మ్యాచ్‌లను కూడా రద్దు చేసిన విషయం తెలిసిందే.ఇక ఐపీఎల్‌లో ప్లే ఆఫ్స్ దశ ప్రారంభంకానున్నది. ఇవాళ తుది లీగ్ మ్యాచ్ జరగనున్నది. గురువారం క్వాలిఫైయర్ 1 మ్యాచ్ జరగనున్నది. ఆపరేషన్ సింధూర్‌లో ధైర్యసాహసాలను ప్రదర్శించిన సైనికులకు నివాళి అర్పించేందుకు బీసీసీఐ ప్లాన్ వేసింది. దీనిలో భాగంగా ఐపీఎల్ ఫైనల్‌కు త్రివిధ దళాధిపతులను ఆహ్వానించింది. ఆర్మీ, నేవీ, ఎయిర్ డిఫెన్స్‌కు చెందిన టాప్ ఆఫీసర్లను, సైనికులను కూడా ఫైనల్‌కు ఆహ్వానించారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్‌ను సెలబ్రేట్ చేసుకోనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. సైనిక దళాల ధైర్యం, తెగువ, నిస్వార్థ సేవ పట్ల బీసీసీఐ సెల్యూట్ చేస్తుందని సైకియా పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో చూపిన సైనికుల తెగువను ఆయన ప్రశంసించారు. సైనికులు తమ సత్తాతో దేశాన్ని రక్షించినట్లు చెప్పారు. యావత్ దేశ ప్రజలకు ప్రేరణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మన సైనిక దళాలను, హీరోలను గౌరవించాలన్న ఉద్దేశంతో.. ముగింపు వేడుకలను వారికి అంకితం ఇచ్చేందుకు నిర్ణయించామని ఆయన చెప్పారు.

## ప్రపంచ రికార్డ్ నెలకొల్పి..
## సచిన్ రికార్డ్ బ్రేక్ చేసిన సూర్యకుమార్ యాదవ్!

**తెలంగాణవీణ, క్రీడలు :**

ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ మరో ఐపీఎల్ 2025లో పరుగుల వరద పారించాడు. లీగ్‌లోని చివరి మ్యాచ్‌లో అదే ప్రదర్శనను కొనసాగించడం ద్వారా, సూర్యకుమార్ యాదవ్ ప్రపంచ రికార్డును కూడా సృష్టించాడు. టీ20 క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో వరుసగా అత్యధికంగా 25 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన ఆటగాడిగా సూర్యకుమార్ యాదవ్ రికార్డు సృష్టించాడు. అంతేకాదు.. సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా బద్దలు కొట్టాడు.పంజాబ్‌తో మ్యాచ్‌లో ఆరో ఓవర్లో తొలి వికెట్ పడటంతో క్రీజులోకి వచ్చిన సూర్య, 9వ ఓవర్ చివరి బంతికి బౌండరీ కొట్టి 25 పరుగుల మార్కును దాటాడు. దీంతో భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వరుసగా 14వ ఇన్నింగ్స్‌లో



25 పరుగుల మార్కును దాటాడు.దీంతో దక్షిణాఫ్రికా మాజీ టీ20 కెప్టెన్ టెంబా బావుమాను అధిగమించి సూర్య కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో తొలిసారిగా లీగ్ దశలోని ప్రతి మ్యాచ్‌లో 25 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఘనతను సూర్య సాధించాడు.సూర్యకుమార్ యాదవ్ ఈ సీజన్‌లో 605 పరుగుల మార్కును దాటాడు. దీనితో, అతను ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగుల స్కోరు రికార్డును నెలకొల్పాడు. అంతకుముందు, సూర్య ఐపీఎల్ 2023లో 605 పరుగులు చేశాడు, ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన. ప్రత్యేకత ఏమిటంటే సూర్య ముంబై మాజీ కెప్టెన్, గొప్ప బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా బద్దలు కొట్టాడు.2010 ఎడిషన్‌లో సచిన్ 618 పరుగులు చేశాడు, ఇది గత 17 ఐపీఎల్ ఎడిషన్లలో ముంబై బ్యాట్స్‌మన్ చేసిన అత్యధిక పరుగులు చేసిన రికార్డు. ఇప్పుడు సూర్య 650 పరుగులు పూర్తి చేయడం ద్వారా క్రికెట్ దేవుడి రికార్డును బద్దలు కొట్టాడు.



తెలంగాణ వీణ

సినిమా

బుధవారం మే 28 2025










# రెండోమారు తెలంగాణ ఆడపడుచుగా కీర్తిసురేష్.. ?

**తెలంగాణవీణ, సినిమా :**
మహానటి' సావిత్రిగా శిఖర సమానమైన అభినయాన్ని ప్రదర్శించిన కీర్తిసురేష్.. 'సర్కారువారి పాట'లో కళావతిగా యువతరం కంటికి కునుకు లేకుండా చేశారు. నటిగా ఈ పొంతన లేని కోణాలు ఆమెను నిజంగానే మహానటిని చేశాయి. ప్రస్తుతం అటు సినిమాలు, ఇటు వెబ్ సిరీస్‌లు అంటూ క్షణం తీరిక లేకుండా కెరీర్ సాగిస్తున్నారు కీర్తి సురేశ్. చెన్నయ్ టూ ముంబై వయా హైదరాబాద్.. ఇది ప్రస్తుతం కీర్తి సురేశ్ పరిస్థితి. 'అక్క' అనే వెబ్ సిరీస్‌తో పాటు, తమిళంలో 'రివాల్వర్ రీటా' అనే సినిమా కూడా చేస్తున్నారు.ఇక తెలుగులో 'బలగం'ఫేం వేణు యల్దెండి దర్శకత్వంలో రూపొందనున్న 'ఎల్లమ్మ'లో టైటిల్ రోల్ కీర్తి సురేషే అని ఫిల్మ్ సర్కిల్స్‌లో వార్త బలంగా వినిపిస్తున్నది. ఇప్పటికే 'దసరా' సినిమాలో తెలంగాణ మహిళగా అద్భుతంగా నటించారు కీర్తి. ఇప్పుడు 'ఎల్లమ్మ'గా ఆమె ఖరారైన మాట నిజమైతే.. రెండోసారి తెలంగాణ పడుచుగా కనిపిస్తారన్నమాట. వేణు యల్దెండి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం తెలంగాణ సంస్కృతి, నమ్మకాల నేపథ్యంలో సాగుతుందని తెలుస్తున్నది. వచ్చే నెలలోనే ఈ సినిమా షూటింగ్ మొదలుకానున్నదట.



# కన్నప్ప హార్డ్ డ్రైవ్ మిస్సింగ్..

## 24 ఫ్రేమ్స్ సిబ్బందిపై కేసు నమోదు

**తెలంగాణవీణ, సినిమా :**
మంచు విష్ణు హీరోగా తెరకెక్కుతున్న 'కన్నప్ప' సినిమాకు సంబంధించి ఓ కీలక పరిణామం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. కన్నప్ప చిత్రానికి సంబంధించిన ముఖ్యమైన దృశ్యాలు, డేటా ఉన్న హార్డ్ డ్రైవ్ మాయం అయినట్లు చిత్రబృందం తాజాగా వెల్లడించింది. అయితే మిస్ అయిన హార్డ్ డ్రైవ్‌కి సంబంధించి నిర్మాణ సంస్థ 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులపైన నమ్మక ద్రోహం కేసు నమోదు చేసింది. సినిమా ఎగ్జిక్యూటివ్ నిర్మాత రెడ్డి విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు ఫిల్మ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ముంబైలోని హెచ్ఐవీఈ స్టూడియోస్ నుంచి డీటీడీసీ కొరియర్ ద్వారా పంపిన ఈ హార్డ్ డ్రైవ్‌ను ఆఫీస్ బాయ్ రఘు అందుకున్నాడు. అయితే, ఆ తర్వాత రఘు కనిపించకుండా పోయాడు.రఘు హార్డ్ డ్రైవ్‌ను చరిత అనే మహిళకు అప్పగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఆ తర్వాత చరిత కూడా కనిపించకుండా పోవడంతో, ఈ ఘటన వెనుక సినిమాకు నష్టం కలిగించే కుట్ర కోణంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. రఘు, చరితల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.




# క్రూయిజ్ షిప్‌లో నవ్వుల సునామీ..


## 'హౌస్‌ఫుల్ 5' ట్రైలర్ వచ్చేసింది


**తెలంగాణవీణ, సినిమా :**
బాలీవుడ్‌లో నవ్వుల జాతర సృష్టించిన 'హౌస్‌ఫుల్' ఫ్రాంచైజీ నుంచి తాజాగా మరో చిత్రం రాబోతుంది. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీ నాలుగు చిత్రాలు రాగా.. తాజాగా 5వ చిత్రం రాబోతుంది. అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, రితేష్ దేశ్‌ముఖ్ ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. తరుణ్ మన్సుఖానీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. నడియాడ్‌వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాడ్‌వాలా ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం జూన్ 06న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్.ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒక లగ్జరీ క్రూయిజ్ షిప్‌లో జరిగే మర్డర్ మిస్టరీ చుట్టూ ఈ సినిమా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఒక బిలియనీర్ హత్యకు గురవగా.. అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్, అభిషేక్ బచ్చన్ పాత్రలు నిందితులుగా ఉంటాయి. అయితే ఆ హత్య చేసింది ఎవరనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఈ చిత్రం బాలీవుడ్‌లో ఇటీవలి కాలంలో అతిపెద్ద తారాగణాలలో ఒకటిగా నిలిచింది. ఇందులో అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్, అభిషేక్ బచ్చన్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, సంజయ్ దత్, జాకీ ష్రాఫ్, ఫర్దీన్ ఖాన్, శ్రేయాస్ తల్పడే, నానా పటేకర్, డీనో మోరియా, నర్గీస్ ఫక్రి, సోనమ్ బజ్వా, చిత్రాంగద సింగ్, సౌందర్య శర్మ, చంకీ పాండే, జానీ లివర్, నికితిన్ ధీర్, రంజీత్ తదితరులు నటించబోతున్నారు.

# నా తొలి ముద్దు జీవితాంతం గుర్తు పెట్టుకుంటా:

## నాగ చైతన్య

**తెలంగాణవీణ, సినిమా :**
అక్కినేని మూడో తరం వారసుడు నాగ చైతన్య ఎంత రిజర్వ్ డ్ గా ఉంటారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన పెద్దగా వివాదాలలో తలదూర్చడు. సమంతని ప్రేమించి పెళ్లి చేసుకొని ఆ తర్వాత కొన్ని కారణాల వలన విడిపోయి హాట్ టాపిక్ అయ్యాడు. అయితే గత ఏడాది చైతూ..టాలీవుడ్ హీరోయిన్ శోభితని వివాహం చేసుకున్నాడు. వీరి వివాహాన్ని అక్కినేని ఫ్యామిలీ అట్టహాసంగా నిర్వహించింది. ప్రస్తుతం శోభిత, చైతూ తమ సినిమాలతో బిజీ బిజీగా గడుపుతున్నారు. ఈ క్రమంలోనే నాగ చైతన్య తన తొలి ముద్దు ఎవరికీ ఇచ్చాడో ఓ షో ద్వారా తెలియజేస్తూ అందరికి షాక్ ఇచ్చారు.ఇటీవల రానా షోకు వెళ్లిన నాగ చైతన్య తన తొలి ముద్దు ఎవరికి ఇచ్చిన విషయాన్ని రివీల్ చేశాడు. తన తొలి ముద్దు అనుభవం గురించి సిగ్గుపడుతూ.. స్టన్నింగ్ సమాధానం చెప్పాడు. మొదటి ముద్దు ఎప్పుడు.? ఎవరికి పెట్టావో గుర్తుందా..? అని రానా అడిగిన ప్రశ్నకు నాగ చైతన్య సమాధానం ఇస్తూ.. తొమ్మిదో తరగతిలోనే ఓ అమ్మాయికి మొదటి ముద్దు ఇచ్చిన విషయాన్ని నాగ చైతన్య రివీల్ చేశాడు. ఆ ముద్దు తన జీవితమంతా పని చేసిందని చెబుతూ కాస్త ఎమోషనల్ అయ్యాడు. ఇక గతంలో ఓ అభిమాని తన దగ్గరకు వచ్చి సమంత కంటే మీరే తెల్లగా ఉన్నారని చెప్పడం కూడా తనకు మర్చిపోలేని జ్ఞాపకం అని చెప్పుకొచ్చాడు నాగ చైతన్య.





# విడుదలకు ముందే సక్సెస్ సెలబ్రేషన్స్..

## 'భైరవ' టీమ్ వీడియో వైరల్

**తెలంగాణవీణ, సినిమా :**
సాధారణంగా ఒక సినిమా థియేటర్లలో విడుదలై, విజయం సాధించిన తర్వాతే సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకుంటారు. కానీ, ఓ చిన్న సినిమా టీమ్ వినూత్నంగా తమ చిత్రం విడుదలకు ముందే విజయోత్సవాలను జరుపుకొని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ సినిమానే 'భైరవం' . ఈ సినిమాలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, మంచు మనోజ్, నారా రోహిత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'నాంది', 'ఉగ్రం' వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన విజయ్ కనకమేడల ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధా మోహన్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. మే 30, 2025న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళంలో సూపర్ హిట్టైన 'గరుడన్' చిత్రానికి ఇది రీమేక్‌గా వస్తుంది.అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా మూడు రోజులు ఉండగా.. ఇప్పటినుంచే సక్సెస్ సెలబ్రేషన్స్ స్టార్ట్ చేసింది చిత్రయూనిట్. ఇటీవల ఈ సినిమా ప్రీమియర్‌ను ప్రదర్శించగా.. సినిమాను చూసిన డిస్ట్రిబ్యూటర్లు, కొందరు సినీ ప్రముఖుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో, సినిమా విజయం అవ్వడం పక్కా అని చిత్రబృందం భావించింది. దీంతో విడుదలకు ముందే హైదరాబాద్‌లో సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించి అందరినీ ఆశ్చర్యపరిచింది.

Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written